PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 85 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 25 మార్చి 2025

**రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువు**




**పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**






# ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద సహాయక చర్యలు

- ●సీనియర్ ఐఎఎస్‌కు పర్యవేక్షణ బాధ్యతలు
- ●సిఎస్‌ను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాద ఘటనలో సహాయక చర్యలను కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు జరిగిన సహాయక చర్యల్లో పురోగతిపై సీఎం రేవంత్ సోమవారం మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టన్నెల్ వద్ద ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. టన్నెల్ వద్ద సహాయక చర్యల నిరంతర పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. నిపుణుల కమిటీ సూచనలను తీసుకుంటూ కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని రెస్క్యూ ఆపరేషన్‌లో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా

వివరాలు 2లో



# మహేశ్వరరెడ్డి వర్సెస్ పొన్నం

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** మీ మేనిఫెస్టో లో మూసి ప్రక్షాళన ఉంది, దానికి నిధులు ఎందుకు కేటాయించలేదు? అంటూ బిజెఎల్‌పి నేత మహేశ్వరరెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ మూసికి సంబంధించి నిధులు ఇస్తారా లేదా%"%? హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. మీరు మేనిఫెస్టోలో పెట్టిన మూసికి నిధులు ఇస్తారా లేదా..?, మూసి అభివృద్ధి తెలంగాణలో అంతర్భాగం కాదా? అని ప్రశ్నించారు. అనేక రాష్ట్రాల్లో కాలువల అభివృద్ధికి నిధులు ఇస్తున్నారని, గాంధీని వ్యతిరేకించే మీరు గాంధీ స్మృతివనంకి నిధులు ఇస్తారా లేదా..? తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు.హైదరాబాద్‌కి

వివరాలు 2లో

# పల్లెల్లో పడకేసిన పాలన

- సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలు
-పల్లెల దుస్థితిపై కేసీఆర్ మండిపాటు

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పాలనలో పల్లెన్నీ పట్టించుకునే నాథుడే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కేటీఆర్. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెల్లో నెలకొన్న సమస్యలపై కేటీఆర్ స్పందించారు. అమ్మ పెట్టదు.. అడుక్క తిననివ్వదు.. అన్న చందంగా కాంగ్రెస్ పాలన ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. పల్లెలు నాడు కేసీఆర్ పాలనలో ప్రగతి బాట పడితే.. నేడు 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధోగతి బాట పట్టాయని ధ్వజమెత్తారు. 14 నెలలుగా సర్పంచులు లేక



కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడం

వివరాలు 2లో



# కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

- మూల్యాంకనంలో నాణ్యత లేదని పిటిషన్
-పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్)::** గ్రూప్-1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో అభ్యర్థులు పిటిషన్ వేశారు. మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జక్టులుంటే 12 సబ్జక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వెల్లడించారు.

వివరాలు 2లో

# ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించేది లేదు

- నెలాఖరు వరకు 25శాతం రాయితీతో అమలు
- త్వరలోనే భూముల విలువ పెంపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి





# ఆచరణ సాధ్యమైన హామీలు ఇవ్వండి

- ☛ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా..?
- ☛అసెంబ్లీలో గళమెత్తిన అక్బరుద్దీన్

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆచరణసాధ్యమైన హామీలు ఇవ్వండి..ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా అంటూ అసెంబ్లీలో అక్బర్దీన్ గళమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో తన ప్రత్యేక శైలిలో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, అవి అమలయ్యే విధానం, ప్రజలకు అందే ప్రయోజనాలను ఉద్దేశించి ఆయన నేరుగా ప్రభుత్వ తీరును ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరు ఫేకులు గురించి ఒక కథను

వివరాలు 2లో

# హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికకు షెడ్యూల్ విడుదల

**ఏప్రిల్ 23న పోలింగ్.. 25న ఫలితాలు**

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం మే 1తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 28న నోటిఫికేషన్ విడుదలకానుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అదే నెల 7న నామినేషన్లను పరిశీలించనున్నారు. నామి నేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. అదే నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. 25న ఫలితాలు ప్రకటిస్తారు.



# అధికార విధులకు దూరంగా జస్టిస్ వర్మ

## - సుప్రీం కొలీజియం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,24(పిసిడబ్ల్యూ న్యూస్):** అధికార విధులకు దూరంగా జస్టిస్ వర్మను ఉంచుతూ..సుప్రీం కొలీజియం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున నోట్లకట్టలు బయటపడిన వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు పంపాలని అధికారికంగా సిఫారసు చేసింది. ఈ మేరకు సీజేఐ సంజయ్ ఖన్నా, న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, సూర్య కాంత్, ఓసీ ఓకాతో కూడిన కొలీజియం అధికారిక ప్రకటన జారీ చేసింది. దీనికి మందు, జస్టిస్ యశ్వంత్ వర్మను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ సోమవారం ఉదయం నిర్ణయం తీసుకుంది.



## ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద సహాయక చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

దోమలపెంట సమీపంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గర ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రిటైనింగ్ వాల్ కడుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర పైకప్పు కుంగిపోయింది.. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోయారు. భారీగా బురద, నీరు ఉబకడంతో పాటు-ధ్వంసమైన టన్నెల్ బోరింగ్ మిషన్ పరికరాలు రెస్క్యూ ఆపరేషన్ ఛాలెంజింగ్‌గా మారాయి. అయినప్పటికీ సహయక బృందాలు తీవ్రంగా కృషి చేసి ఘటన స్థలం వద్దకు చేరుకున్నాయి. టన్నెల్ వద్ద దాదాపు నెల రోజులుగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఎట్టకేలకు 16వ రోజు ఓ కార్మికుడి డెడ్ బాడీని వెలికితీశాయి. మిగిలిన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

## అక్రిడేషన్లు మరో 3నెలలు పొడిగింపు

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు సమాచారశాఖ కమిషనర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని జూన్ 30వ తేదీ వరకు పొడిగించారు. అక్రిడేషన్ కార్డుల గడువును పొడిగించడం ఇది నాలుగోసారి. ఇప్పటికే అక్రిడేషన్ల పరిమితి, విధివిధానాలపై ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి ఓ నివేదిక సమర్పించారు.

## మహేశ్వరరెడ్డి వర్సెస్ పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన అంశాల్లో మీరు మేనిఫెస్టో లో పెట్టారని వెల్లడించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకుపోతున్నమని తెలిపారు. మూసి నిర్వాసితులను బలవంతంగా ఎక్కడ తొలగించడం లేదు, వారికి పునరావాసం కల్పిస్తూ అన్ని రకాల సహకారం ఇస్తున్నామని వెల్లడించారు. హైదారాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తామని మేనిఫెస్టోలో చెప్పారు మరి నిధులు ఎందుకు కేటాయించడం లేదు? అని ప్రశ్నించారు. ఏం లేకుండానే ప్రభుత్వం మీద బట్ట కాల్చి మీద వేస్తున్నారని చెప్పుకొచ్చారు. మూసి పునరాభివృద్ధికి మీరు నిధులు కేటాయిస్తారా లేదా ..? మీరు మేనిఫెస్టో లో పెట్టిన విధంగా నిధులు ఎందుకు కేటాయించడం లేదని సూటిగా ప్రశ్నించారు. సిఎం ఈసా మూసి ఎక్కడైతే ప్రారంభమైందో అక్కడ బాపు ఘాట్ దగ్గర గాంధీ స్మృతి వనం కట్టి దేశంలోనే బాపు ఘాట్ అభివృద్ధి చేసుకోవాలని సిఎం ఆలోచన అని అన్నారు. అలా చేయడం వల్ల అక్కడ అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఒక నగరంలో రెండు ప్రాంతాలను కలుపుతూ నదులు పోయే ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందన్నారు. ఏదో దుర్బుద్ధి ఉందని ప్రభుత్వంను బదనం చేయడం తగదని బిజెఎల్పీ మహేశ్వరరెడ్డిపై మంత్రి పొన్నం మండిపడ్డారు.

## పల్లెల్లో పడేకేసిన పాలన

(మొదటి పేజీ తరువాయి)

లేదని మండిపడ్డారు. 12,754 గ్రామ పంచాయతీల్లో పాలన పడకేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని.. దీంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకవైపు తాగునీరు, మరోవైపు విద్యుత్ కోతలు ప్రజలను వెంటాడుతున్నాయని అన్నారు. హరితహారం మొక్కల హాహాకారాలు.. పంచాయతీల నిర్వహణకు కార్యదర్శుల ఆపసోపాలు పాడుతున్నారని పేర్కొన్నారు. హరితహారంలో మొక్కలు నాటించి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ, మొక్కల సంరక్షణకు ట్రాక్టర్ల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాల ఏర్పాటుతో దేశానికే అదర్శంగా నిలిచి అవార్డులు అందుకున్న తెలంగాణ పల్లెలు.. నేడు కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యంతో నిధులు లేక వెల వెలబోతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఆచరణ సాధ్యమైన హామీలు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

వినిపించారు. ఈ కథ ప్రభుత్వాలు చేసే వాగ్దానాలను నమ్మే పరిస్థితి ఎంత అసాధారణంగా మారిందో చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తుంటాయి. అయితే, ఆ హామీలను నెరవేర్చడానికి అవసరమైన నిధులు లేవు. 'ఇది చేస్తాం, అది ఇస్తాం' అంటూ ప్రజలను విశ్వసింపజేసేలా హామీలు ఇస్తూ, ఆర్థిక భారం పెంచుకుంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోతోందని ఆయన అన్నారు. కేవలం ప్రచార హామీలతో కాకుండా, నిజంగా అమలు చేయగలిగే విధంగా హామీలు ఇచ్చి, ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేను ఎవరినీ లక్ష్యంగా వ్యాఖ్యలు చేయడం లేదు, కానీ మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చాలా హామీలు ఇచ్చినా, ప్రయోజనం పొందే స్థాయిలో ప్రజలకు అందడం లేదు. ఈ వ్యాఖ్యల ద్వారా, ప్రభుత్వ విధానాలను పునఃసమీక్షించి, అసలు లబ్దిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు పరిశీలనాత్మకంగా, ప్రజలకు నిజమైన ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల పేపర్లు దిద్దించారని.. దీంతో మూల్యాంకణంలో నాణ్యత కొరవడింద న్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. ఈ మెయిన్స్‌కు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్లు తెలిపారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు.. టీ-జీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్-1 మెయిన్స్‌పై తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈనెలలోనే గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలతో పాటు- గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్-2 రాత పరీక్షల మార్కులు విడుదలయ్యాయి. అలాగే మార్చి 14న గ్రూప్-3 ఫలితాలను కూడా విడుదల చేసింది. అలాగే గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 1,365 గ్రూప్-3 సర్వీసుల పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 రాత పరీక్షలు జరిగాయి. ఈనెల 14న గ్రూప్-3 ఫలితాలను టీ-జీపీఎస్సీ విడుదల చేసింది.

## ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించేది లేదు

- నెలాఖరు వరకు 25శాతం రాయితీతో అమలు
- త్వరలోనే భూముల విలువ పెంపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్ఆర్ఎస్ గడువు పొడగించే ఆలోచన లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పర్మిషన్ ఇప్పుడు కాకుండా ఇళ్ళు కట్టేటప్పుడు కావాలంటే అప్పుడు వందశాతం ఎల్ఆర్ఎస్ కట్టాల్సి ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన మేర స్పందన ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువు మార్చ్ 31 వరకు ఉందని.. ఆలోపు చేసుకున్న వారికి 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని తెలిపారు. సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో భూవిలువలను పెంచబోతున్నామని తెలిపారు. త్వరలో భూ సర్వే కోసం ప్రతీ మండలానికి సర్వేయర్, డిప్యూటీ- సర్వేయర్‌ను నియమిస్తామని.. అలాగే లైసెన్డ్ సర్వేయర్‌లకు అవకాశం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల మంది లైసెన్డ్ సర్వేయర్లు ఉన్నారని వీరికి శిక్షణ ఇచ్చి అవకాశం కల్పిస్తామన్నారు. సాదాబైనామాల విషయంలో కొత్త దరఖాస్తు లను స్వీకరించమని తేల్చి చెప్పారు. పాత దరఖాస్తులలో 13 లక్షల అప్లికేషన్లను గత ప్రభుత్వం తరస్కరించిందని దరఖాస్తు తిరస్కరణకు గురైనవారు అప్పిలేట్ ఆథారిటిలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. కేంద్రం ప్రధాని అవాస్ యోజన కింద అర్బన్ ఏరియాలో 1 లక్ష 13 వేల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. అర్బన్ ఏరియాలో కట్టే ఇళ్లకు కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుందని.. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రూరల్ ఏరియాకు సంబందించి కేంద్రం ఇంకా ఎలాంటి క్లారిటీ- ఇవ్వలేదని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపై మంత్రి పొంగులేటి స్పష్టత ఇచ్చారు. తనకు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి మధ్య ఎలాంటి సమస్య లేదని చెప్పారు. అనిరుధ్ రెడ్డితోనే కాకుండా ఇతర ఏ ఎమ్మెల్యేతో కూడా విభేదాలు లేవని వివరణ ఇచ్చారు.

## పోలీసుల విచారణకు హాజరైన యాంకర్ శ్యామల

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్‌చేసినందుకు పలువురి యూట్యూబర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యాంకర్ శ్యామల న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు శ్యామల. అయితే విచారణకు వచ్చిన యాంకర్ నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఒక సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాంకర్ శ్యామలపై పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణకు రావాల్సిందిగా గతంలో పోలీసులు ఒకసారి నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులకు ఆమె స్పందించలేదు. ఈ కేసులో అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే క్వాష్ పిటిషన్‌ను కూడా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఆమెకు ముందస్తు బెయిల్ ఇచ్చారు. శ్యామలను అరెస్టు చేయవద్దని, నోటీసులు ఇచ్చి విచారించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. అలాగే సోమవారం పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని హైకోర్టు చెప్పిన నేపథ్యంలో ఉదయమే శ్యామల విచారణకు వచ్చారు.

## ఇచ్చిన వాగ్దానాలు అడిగితే నిర్బంధాలా..?

**- అరెస్టు చేసిన ఆశావర్కర్లను వెంటనే విడుదల చేయాలి : హరీశ్‌రావు**

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రమంగా అరెస్టు చేసిన ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్‌చేశారు ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేయడమే వారు చేసిన నేరమా? వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, బలవంతంగా వాహనాల్లో ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఆశా సోదరీమణుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎందుకింత నిర్బంధం, ఎందుకింత నిరంకుశత్వం? ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవం ఇదేనా? హామీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని 15 నెలల్లోనే అన్ని వర్గాల ప్రజలు గుర్తించారన్నారు. కాంగ్రెస్ చేసిన నయ వంచనపై ఎక్కడిక్కడ నిలదీస్తున్నారని పేర్కొన్నారు. నిలదీత నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ తప్పించుకుంటుందని ఎద్దేవా చేశారు. గొంతెత్తిన వారిని అక్రమంగా అరెస్టులు చేస్తూ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచింది, రెండు పూర్తి స్థాయి బడ్జెట్లను ప్రవేశపెట్టింది. ఇంకా ఎన్నాళ్లూ హామీలు అమలు చేయకుండా సాకులు చెబుతారు రేవంత్ రెడ్డి గారూ.. ఎన్నికల హామీ ప్రకారం, ఆశా వర్కర్ల వేతనాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు.

## రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువు

- ఎంఎంటీఎస్ ఘటనపై బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే ఘటనలని మండిపాటు

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మహిళలకు రోజురోజుకూ రక్షణ లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైల్వే ఎస్పీ చందన దీప్తితో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. తనను రక్షించుకునేందుకు రైలు నుంచి దూకిన యువతి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని రైల్వే ఎస్పీ వద్ద ఎమ్మెల్సీ కవిత ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై అత్యాచార ఘటనలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని, ఎక్కడా భద్రత లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్, మెట్రో రైలులో కూడా వేధింపులు జరగటం బాధాకరమని, ఇప్పటికైనా లోకల్ రైల్‌ల్లోనూ భద్రతను పెంచాలని ఆమె డిమాండ్‌చేశారు. మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని తాము పదేపదే చెబుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కవిత డిమాండ్ చేశారు.



## తానా సదస్సుకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా కాన్ఫరెన్స్ అమెరికాలో జూలై 3 నుంచి 5 వరకు జరగనున్నది. ఇందుకోసం ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సిఎం రేవంత్‌ను కూడా తానా ప్రతినిధులు ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి 24 వ తానా సదస్సుకు ఆహ్వానించారు.

## హైడ్రాపేరుతో దందాలు చేస్తే కఠిన చర్యలు

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక**

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** హైడ్రా పేరుతో లావాదేవీలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. ఇలాంటి దందాలను చూస్తూ ఊరుకునేది లేదని సోమవారం ఆయన స్పష్టం చేశారు. వంశీరామ్ బిల్డర్స్‌పై ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ విషయంపై చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. ఒక్క వంశీ రామ్ బిల్డర్స్ మాత్రమే గాకుండా, రాజ్‌పుష్ప వంటి బిల్డర్స్‌కు కూడా బఫర్ జోన్లలో డంపింగ్ చేశారని రంగనాథ్ తెలిపారు. వారందరికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. హై డ్రా పేరుతో సెటిల్ మెంట్లు- చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే చాలా కేసులు నమోద య్యాయని అలాంటి అధికారులు ఉంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు.

## కెసిఆర్‌పై అసత్య ఆరోపణలు

**- బండి సంజయ్‌పై పోలీసులకు బిఆర్ఎస్ ఫిర్యాదు**

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణమాజీ సీఎం కేసీఆర్ దొంగ నోట్లు ముద్రించి ఎన్నికల్లో పంచాడంటూ కేంద్రం మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ మండిపడింది. ఈ మూరకు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్‌తో పాటు పలువురు నేతలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, కిషోర్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్‌ను ఉద్దేశించి బీదర్‌లో దొంగ నోట్లు ప్రింటింగ్ చేసే మిషన్ ఉందంటూ చేసిన ఆరోపణలు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉన్నాయన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. తాను కేంద్రమంత్రి అనే విషయం మర్చిపోయి ఎలాంటి అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న బండి సంజయ్ తీరు సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు డా. కుర్వ విజయ్ కుమార్, అశ్విన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీపై అధికారుల విచారణ

**- పరీక్షా కేంద్రం చీఫ్ గోపాల్, డిపార్ట్‌మెంట్ అధికారి సస్పెండ్**

**హైదరాబాద్,24(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే తొలి పరీక్ష రోజే.. ఎగ్జాం ప్రారంభమైన 10 నిమిషాలకే తెలుగు ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లీకేజ్ వ్యవహారంపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. నకిరేకల్ గురుకుల పాఠశాలలో తెలుగు ప్రశ్నపత్రం లీకైనట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు కూడా. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తొలుత తేల్చినా.. పోలీసులు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నప్పటికీ పరీక్ష సెంటర్లోకి ఫోన్ ఎలా వచ్చిందనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో ఇద్దరు అధికారులను విధుల నుంచి తొలగించారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. పరీక్ష కేంద్రం ఇన్విజిలేటర్‌గా ఉన్న టీజీటీ సుధారాణిని కూడా సస్పెండ్ చేశారు. అంతేకాకుండా ప్రశ్నాపత్రం ఇచ్చిన విద్యార్థిని కూడా డీబార్ చేశారు. ఇప్పటికే ప్రశ్నపత్రం లీక్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో ఓ బాలుడు, జిరాక్స్ కేంద్రం నిర్వాహకుడు ఉన్నారు. పరీక్ష జరుగుతున్న గది వద్దకు బాలుడు గోడ దూకి వచ్చినట్లు తెలుస్తుంది. అనంతరం విద్యార్థి పరీక్ష రాస్తుండగా కిటికీలో నుంచి ప్రశ్నపత్రం ఫొటో తీసి, అనంతరం ఈ ప్రశ్నపత్రం కాపీని ఆ బాలుడు జిరాక్స్ కేంద్రంలో ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, జిరాక్స్ యంత్రం, కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తన ప్రమేయం లేకపోయినా డిబార్ చేశారని బాధిత విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు పరీక్షలు రాసే అవకాశం ఇవ్వాలని, తానేం తప్పుచేశానని లబోదిబోమని విలపిస్తున్నాడు.

# 37వ సారీ రక్తదానం చేసిన వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు)



**హనుమకొండ, మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి - రామనీల దంపతులు పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు). రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ స్వతంత్ర సమరయోధులు షహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి పురస్కరించుకొని సంవేదన -2లో భాగంగా నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ ఆక్టివిటీస్ (నిఫా), యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మార్చి 23, 2025 తేదీ ఆదివారం రోజున యం.జి.యం హాస్పిటల్ వరంగల్ లో మెగా రక్తదాన శిబిరం లో నేను 37వ సారి రక్తదానం చేయడం జరిగింది. ఆలకిద్దాం, ఆలోచిద్దాం, ఆచరిద్దాం, ఆదుకుందాం. జీవిస్తూ.. రక్తదానం చేద్దాం !, ప్రాణదానం కల్పిద్దాం!!, మరణిస్తూ.. నేత్రదానం చేద్దాం!, ఇద్దరి అందులకు చూపునిద్దాం!!, శరీరదానం చేద్దాం!, వైద్య విద్యకు తోడ్పడుదాం!! , " బ్రెయిన్ డెడ్ తో అవయవదానం చేసి అభాగ్యులకు ప్రాణం పోద్దాం!రక్తదానం చెయ్యండి!, ప్రాణదాతలు అవ్వండి!! . నేను చేస్తున్న ఈ రక్తదాన చైతన్య యుద్ధ కార్యక్రమంలో భాగంగా మీ అందరి సహాయ సహకారాలతో గత 20 సంవత్సరాలు నుండి నేను స్వయంగా 37 సార్లు రక్తదానం చేయడం జరిగింది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక , ఢిల్లీ హర్యానా ఈ 5 రాష్ట్రాలలో 1,00,000 మందికి పైగా రక్తదానం పై అవగాహన కల్పించడం జరిగింది. నేను ఇప్పటి వరకు అత్యవసర సమయంలో ఉన్న వారి కోసం, తలసేమియా వ్యాధి తో బాధపడుతున్న చిన్నారుల కోసం ఇప్పటివరకు 69 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ అత్యవసర సమయంలో ఉన్న వారికి రక్తదాతల అందరి సహకారంతో 18,035 మంది కీ ఉచితంగా రక్తం అందించడం జరిగింది. అదేవిధంగా (కోవిడ్ - 19) కరోన వ్యాధి సమయంలో ప్లాస్మాదానం పై అవగాహన కల్పించి, కరోన బారిన పడిన వారికి 235 మందికి ఉచితంగా ప్లాస్మా అందించడం జరిగింది. ఇప్పటి వరకు అవయవదానం పై 3 అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. నేను 37 సార్లు రక్తదానం చేసినందుకు గాను నా యొక్క గురువులు, వరంగల్ పోలీసు ఉన్నత అధికారులు, రాగంపేట గ్రామ ప్రజలు, నా యొక్క మిత్రులు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ, ప్రోత్సహిస్తున్న నా యొక్క కుటుంబ సభ్యులకు, వరంగల్ పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులకు, నా యొక్క గురువులకు, నా యొక్క యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులకు , రక్తదాతలకు , నా యొక్క మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి...

- వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలి
- టి.బి కో ఆర్డినేటర్ అశోక్



**కరీంనగర్,మార్చి24(పీ సీ డబ్ల్యూ న్యూస్):** నెహ్రూ యువ కేంద్ర కరీంనగర్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వరల్డ్ టీబీ డే కార్యక్రమాన్ని ట్రైబల్ డిగ్రీ కళాశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిబి జిల్లా కో ఆర్డినేటర్ అశోక్ హాజరై వరల్డ్ టిబి డే ని ఉద్దేశించి మాట్లాడారు.టీబీ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని,అనుమానం ఉన్న వారంతా టీబి పరీక్ష చేయించుకోవాలన్నారు. ప్రాథమిక దశలోనే టీబీని గుర్తించి మందులు వాడితే సులభంగా నయమవుతుందన్నారు. ప్రభుత్వాసుపత్రి లోనూ టీబీ పరీక్ష అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి టీబీ తొందరగావ్యాపిస్తుందని,అందువల్ల సమతుల పోషకాహారం తీసుకోవాలని సూచించారు.టీబీ వ్యాధి పరీక్షలకు ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందని,ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్ష ఉచితంగా చేయడంతో పాటు మందులు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రతి నెలా టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న రూ.500 పోషకాహారానికి వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల కు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్,అధ్యాపకులు, యువశక్తి యూత్ సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**జగిత్యాల, మర్చి 24 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బి.ఎస్.లత తో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32, ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత ఆర్డీఓ , శ్రీనివాస్ కలెక్టరేట్ ఏ.ఓ హకీమ్ వివిధ జిల్లా అధికారులు, తహసీల్దార్లు,కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.




# అన్న మీ సలహాలు సూచనలు మాకు ఎంతో అవసరం

- ఆప్యాయతగా పలకరించుకున్న ఎంపీ,ఎమ్మెల్యేలు
- ఆ చిరునవ్వుల పలకరింపులే కొండత అండగా నిలుస్తాయి




**తొర్రూరు ప్రతినిధి, మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓ అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం అంటూసినీ రచయిత రాసిన ఒక పాట. అనురాగంతో ఆప్యాయతగా పలకరించుకున్న వారు అన్నగారి సలహాలు సూచనలు సోదరికి ఎన్నో విధాలుగా కలిసి వస్తాయి. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి తొర్రూరు పట్టణంలో ఆప్యాయంగా పలకరించుకున్నారు. మీరు ఎప్పుడు బిజీగా ఉండే వారే. అమ్మ యశస్విని బాగున్నావా అని ఎంపి పలకరించగా ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ అన్నగారు మీరు ఎలా ఉన్నారు మీ పలకరింపే మాకు కొండంత అండ అంటూ వారి ఇరువురి హృదయపూర్వక సంభాషణ అక్కడున్న అందరిని ఆకర్షించారు. చెల్లెమ్మ నీ ధైర్యాన్ని మెచ్చుకున్నానమ్మ. అసెంబ్లీలో ఇంత చక్కగా ప్రసంగించి ప్రతిపక్షాల ప్రశ్నలకు ధైర్యంగా సమాధానాలు ఇస్తున్నందుకు నిన్ను అభినందిస్తున్నాను అని అన్నారు. వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మీకు కేంద్ర మంత్రిగా పనిచేసిన గొప్ప అనుభవం ఉంది. మీలాంటి సీనియర్ నాయకుల సలహాలు సూచనలు మాకు ఎంతో అవసరం. మీ నుండి నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలు, అనుభవాలు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి అని అన్నారు. తొర్రూరు పట్టణంలో ఒక కార్యక్రమాన్ని ముగించుకొని వెళ్తున్న ఎమ్మెల్యే చూసిన ఎంపీ బలరాం నాయక్ అదే సమయంలో హైదరాబాద్ వెళుతుండగా వెంటనే తన వాహనాన్ని నిలిపివేసి స్నేహపూర్వకంగా పలకరించారు. వారి వెంట ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

# జగిత్యాల జిల్లాలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి



**జగిత్యాల, మర్చి 24 ( పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . భారీ ఈదురు గాలులు, వడగండ్లు, అకాల వర్షాల కారణంగా మొక్కజొన్న, వరి, నువ్వు, కూరగాయలు, తదితర పంటలు నెలకోరిగి దెబ్బ తిన్నాయని పేర్కొన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో అకాల వర్షాల కారణంగా దెబ్బ తినడంతో రైతులు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారనీ శేర్ నర్సారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని అధికార యంత్రాంగం వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే జరిపి పంట నష్టాన్ని అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందజేసి రైతులకు తగిన నష్టపరిహారం అందేలా తగు చర్యలు తీసుకోని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కరీంనగర్ ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన పెన్షన్ దారులు

- పదవి విరమణ పొందిన ప్రతి ఒక్క పెన్షన్ దారునికి 7500 చెల్లించాలి
- పెన్షన్ దారులు భార్యాభర్తలకు వైద్య వసతి కల్పించాలి
- ధర్నా అనంతరం అసిస్టెంట్ కమిషనర్ కు వినతి పత్రాన్ని సమర్పించిన నాయకులు




**తొర్రూరు ప్రతినిధి,మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** పదవి విరమణ పొందిన ప్రైవేటుఉద్యోగులందరూ కరీంనగర్ లోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట మంగళవారం రోజు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈరోజు ఈ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ధర్నా కొనసాగాను న్యాయని పేర్కొన్నారు. ఎన్ ఎ సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ లక్ష్మీ కరవాది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. కరీంనగర్ లోని టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ వెనుక గల ఈపీఎఫ్ కార్యాలయం ప్రధాన రహదారిలో ర్యాలీని నిర్వహించి అనంతరం ఈపీఎఫ్ కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ బ్రెజిస్ కుమార్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీలక్ష్మి కరవాది ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న పెన్షన్దారులందరూ ఒకే వేదికగా కొనసాగాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ దారులకు తీవ్ర అన్యాయం చేస్తుందని వేల కోట్ల నిధులు ఉన్నప్పటికీ కూడా పెన్షన్ దారులకు తగిన న్యాయం చేయక అర్ధాకలితో ఆల్మట్టిస్తున్నారని ఒక్కో పెన్షన్ దారునికి 7500 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షన్దారుడి భార్యా భర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని అన్నారు. దేశవ్యాప్తంగా పెన్షన్ దారుల ఆఖరి పోరాటం అని పేర్కొన్నారు. పెన్షన్ దారులకు ఎలాంటి న్యాయం జరగకపోతే ఢిల్లీలో ధర్నా చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆర్టీసీ పదవి విరమణ పొందిన పెన్షన్ దారులు అనేకమంది పాల్గొన్నారు. వారితోపాటు వివిధ కంపెనీలలో పని చేసిన ఉద్యోగులు,కార్మికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎ సి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వంగ వెంకటేశ్వర్లు,ఎన్ ఎ సి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కట్టా ప్రకాష్,మంచిర్యాలకు చెందిన జిసి మాణిక్యం, దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కర్మాగారం లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన పెన్షన్ దారులు కే.రాంబ్రహ్మం,మధుసూదన్, వెంకటేశ్వర్లు, సిహెచ్ రాజమల్లు,టీ యు ఏం స్వామి, కే, మోహన్ రావు, రామచంద్ర, తదితరులు అనేకమంది పాల్గొన్నారు.

# గ్రామ దీపికల సమస్యలను పరిష్కరించాలని వినతి



**గార్ల, మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ దీపికల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఐ కె పి,వివోఏ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఏపిఎం నరేందర్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ దీపిక లకు ప్రభుత్వం హామీ ప్రకారం 20 వేల రూపాయలు చెల్లించాలని,గ్రామ సంఘం నుండి 3 వేల రూపాయలు చెల్లించాలని,బకాయి ఉన్న శ్రీ నీధి ఇన్ సెంటివ్ లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.అర్హులైన వివోఏలను సిసి లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు సిహెచ్.మౌనిక, కృష్ణ వేణీ,వసంత,వినోద తదితరులు ఉన్నారు

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**జగిత్యాల, మర్చి 24 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** జగిత్యాల పట్టణంలోని సూర్య గ్లోబల్ ప్రైవేట్ హై స్కూల్లో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లోని ఆయా రూములను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. కలెక్టర్వెంట జిల్లా విద్యా శాఖ అధికారి రాము, ఎమ్మార్వో రామ్మోహన్ పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే - బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు: జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్



**జగిత్యాల, మర్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా, ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 20 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని, ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# ఆశ కార్యకర్తల అక్రమ అరెస్ట్ సరి కాదు: కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు రబియా బేగం



**రామడుగు మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆశ కార్యకర్తల ప్రభుత్వం అక్రమంగా అరెస్టు లు చేయడం అప్రజాస్వామికం అని జిల్లా అధ్యక్షురాలు రబియా బేగం ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని అన్నారుఎన్నో ఏండ్లు గా వైద్య అరోగ్య శాఖ లో విధులు నిర్వహిస్తూ చాలి చాలని వేతనాలతో పని చేస్తున్న ఆశ కార్యకర్తల కు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



## గంగాధర ఎస్సై జి వంశీకృష్ణని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**గంగాధర, మార్చి 24(పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని గంగాధర పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన SI వంశీకృష్ణని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందికార్యక్రమంలో గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల.భాస్కర్, మధురానగర్ తాజా మాజీ సర్పంచ్ వేముల అంజి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంచాల.చందు,కాంగ్రెస్ నాయకులు ధాతు.అంజి కలిశారు.

## చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ వితరణ






**ఖమ్మం, మార్చ్ 24 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** బయ్యారం మండలానికి చెందిన చేతన ఫౌండేషన్ ప్రెసిడెంట్ వేనిగల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యా మద్దతు కార్యక్రమంలో భాగంగా రిక్క బజార్ ప్రభుత్వ పాఠశాలకు ఆర్ ఓ వాటర్ ప్లాంట్, వివిధ ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ టీవీలు, ప్రింటర్లు, మైక్ సెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా చేతన ఫౌండేషన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి ఇలాంటి సహాయం అందించడాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశంసించారు. విద్యార్థుల మౌలిక అవసరాలను తీర్చడంలో, ఆధునిక సాంకేతికతను పరిచయం చేయడంలో ఈ విరాళాలు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు. చేతన ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యా రంగానికి మద్దతుగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేలా నిబద్ధతతో ముందుకు సాగుతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దొడ్డ సీతారామయ్య, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, మాదినేని నరసింహరావు, దొడ్డపనేని కృష్ణారావు, షేక్ రషీద్, ఉమాదేవి, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాబోధి బుద్ద విహార్ బుద్ధిస్టులకే చెందాలి

**మోర్తాడ్, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీహార్ రాష్ట్రం గాయ జిల్లాలోని "మహాబోధి బుద్ద విహార్" మనువాదుల కభంద హస్తంలో ఉంది. బి.టి చట్టం ఇది సరైనది కాదు. కావున మహాబోధి బుద్ద విహార్ (మందిరం) భారత బుద్ధిస్టులకే చెందాలని మోర్తాడ్ మండల రెవెన్యూ ఆఫీసర్ చెలుకల కృష్ణ గారికి సోమవారం సాయంత్రం దళిత సంక్షేమ సంఘం (డి.ఎస్.ఎస్) చేత మెమొరెండం అందజేశారు. ఇట్టి పత్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వరకు తమ వాయిస్/ డిమాండ్ చేరాలని ఆఫీసర్ ను అంబేద్కరైట్ ప్రతినిధులు కోరారు. ఇందులో పాలెం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గాయకులు సురేష్ షాహు, అడ్వకేట్ మామిడి రాజేశ్వర్, జర్నలిస్ట్ సమ్రాట్ అశోక్, జర్నలిస్ట్ గన్నారపు శంకర్. ఈ సందర్భంగా డి.ఎస్.ఎస్ అధ్యక్షులు మల్లురి రాజారాం, ప్రధాన కార్యదర్శి జాంబావ చామార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న బి.టి చట్టం రద్దుకై తమ సంఘీభావం ఎప్పటికీ ఉంటుందని తెల్పారు. గాయ జిల్లాలోని మహాబోధి బుద్దవిహార్ వద్ద గత 40 రోజుల నుంచి బౌద్ధ భిక్షువుల ద్వారా సాగుతున్న నిరాహార దీక్షకు తమ బీసీల సంపూర్ణ మద్దతు ఉందని తెలంగాణ బీసీ సంఘం నేత ఘోడ్కే రవీందర్ ప్రకటించారు. నివేదిక పత్రం సమర్పణలో ప్రఖ్యాత కవిరాజా, మామిడి గంగాధర్, ఎం.విజయకుమార్, కూన ప్రవీణ్, మూలనివాసి మాలజీ తదితరులు ఉన్నారు.



## మృత్యుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం, పదివేల రూపాయలు ఆర్థిక సాయం...

### -టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ కరీంనగర్...



**కరీంనగర్,మార్చి24(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ ఆల్ టూ విల్లర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ, సభ్యుడైన శ్రీమంతుల విగ్నేష్ వృత్తిరీత్యా టూ విల్లర్ మెకానిక్ నివాసము ప్రకాశం గంజ్ 49వ డివిజన్, శ్రీమంతుల విగ్నేష్ తండ్రి సంవత్సరికం సందర్భంగా గంగా స్నానానికి వెళ్లి కోటిలింగాలు దేవాలయం వద్ద పుణ్యస్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ టూ విల్లర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తిప్పర్తి శ్రీనివాస చారి ఉపాధ్యక్షులు ఎస్ డి అప్రోచ్ ఎద్దు రవి ప్రధాన కార్యదర్శి సత్మారం సహాయ కార్యదర్శి గూట్ల గోపి కోశాధికారి ఆడెపు రమేష్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొని మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం గా పదివేలు 10000/- ఇచ్చి అసోసియేషన్ సభ్యునికి ప్రగాఢ సంతాపం తెలిపినారు.

## పైపు లైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు...



**మానకొండూర్,మార్చ్24(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్, శంకరపట్నం, గన్నేరువరం మండలాలకు 71.40 లక్షల రూపాయలు మంజూరైనట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో పైపు లైన్లు వేసేందుకు ఈ నిధులు మంజూరైనట్టుగా ఆయన వివరించారు.మానకొండూర్ మండలానికి రూ.35.30 లక్షలు:-మానకొండూర్ మండలానికి రూ.35.30 లక్షలు మంజూరు కాగా, ముంజంపల్లి గ్రామానికి రూ.8.30 లక్షలు, చెంజర్లకు రూ. 5 లక్షలు, గంగిపల్లి కి 9.50 లక్షలు, బంజేరుపల్లికి రూ. 4 లక్షలు, కొండపలకలకు రూ. 8.30 లక్షలు కేటాయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. శంకరపట్నం మండలానికి రూ.19.40 లక్షలు:-శంకరపట్నం మండలానికి 19.40 లక్షలు మంజూరు కాగా, అర్కండల్ గ్రామానికి రూ.50వేలు, గద్దపాకకు లక్షా 50వేలు,కాచాపూర్ కు రూ.2 లక్షలు, కేశవపట్నానికి రూ.3 లక్షలు, కొత్తగట్టుకు రూ. 2 లక్షలు, లింగాపూర్ కు లక్షా 50వేలు, మెట్ పల్లికి రూ.40వేలు, ముత్తారానికి లక్షా 50వేలు, రాజాపూర్ కు రూ.లక్షా 50వేలు, తాడికల్ కు రూ.2.50 లక్షలు, చింతగుట్టకు లక్ష రూపాయలు కేటాయించినట్టు ఎమ్మెల్యే వివరించారు.గన్నేరువరం మండలానికి రూ.16.70 లక్షలు:-గన్నేరువరం మండలానికి రూ.16.70 లక్షలు మంజూరు కాగా, పంతుల్ కొండాపూర్ గ్రామానికి రూ. 2 లక్షలు, హన్మాజీపల్లికి రూ.60వేలు, గునుకుల కొండాపూర్ కు రూ.లక్ష, మాదాపూర్ కు రూ.లక్ష, గన్నేరువరానికి రూ.3.50 లక్షలు, చొక్కారావుపల్లికి రూ.2 లక్షలు, సాంబయ్యపల్లికి రూ.2 లక్షలు, చాకలివానిపల్లికి రూ. 2 లక్షలు, గుండ్లపల్లికి రూ.2 లక్షలు కేటాయించినట్టు డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు.

## బీజాపూర్, దంతేవాడ ఎన్కౌంటర్ భూటకం

### - విజయవాడలో జరిగిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా 115 వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం



**విజయవాడ, 2025,మార్చి-22, (పీసీడబ్ల్యూ న్యూస్):** ఇటీవల రెండు రోజుల కిందట బీజాపూర్, దంతేవాడలో 30 మంది ఆదివాసి బిడ్డలను ఎన్కౌంటర్ పేరుతో కాల్చి చంపడాన్ని తెలంగాణ రైతు-కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు తీవ్రంగా ఖండించారు. మార్చి-1 నుండి 31 వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మార్చి-8, 115 వ అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాన్ని ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా ఎత్తిపట్టండని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ(విముక్తి)) రెండు తెలుగు రాష్ట్రాల కమిటీ ఇచ్చిన పిలుపులో బాగంగా విజయవాడలో పీఓడబ్ల్య(విముక్తి) కార్యకర్తల సమావేశం పి.సునీత అధ్యక్షతన శనివారం రోజు జరిగింది. 2025, మార్చి-22 న క్రిష్ణా జిల్లా, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించిన వారిలో ఉన్నారు. ఈసందర్భంగా చిట్టిబాబు ప్రసంగిస్తూ ఏకపక్షంగా జరిపిన కాల్పుల్లో 30 మంది ఆదివాసి బిడ్డలను పొట్టన పెట్టుకోవడం ముమ్మాటికీ ఇది బూటకపు ఎన్కౌంటర్ అని ఆరోపించారు. ఇలాంటి అమానుష, అమానీయమైన దుర్మార్గపు ప్రభుత్వ, ఫాసిస్టు, పోలీసు, మిలిటరీ చర్యలను తీవ్రంగా ఖండించాలని కోరారు. 2026 మార్చ్ చివరి తేదీలోపల మావోయిస్టు రహిత భారత్ గా మార్చే పేరుతో ఆదివాసి ప్రజల జీవించే హక్కును, ప్రక్రుతి పర్యావరణాన్ని మంట గలిపి, బడా కార్పొరేట్ సంస్థల దోపిడీకి అనుకూలంగా అటవీ సంపదలను అప్పనంగా అప్పజెప్పేందుకు జరుగుతున్న కుట్రలో బాగమే ఎన్కౌంటర్ల పేరుతో ఆదివాసులను, వారికి అండగా నిలిచిన మావోయిస్టులను అంతమొందిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైన కేంద్రంలోని ప్రదాని నరేంద్రమోదీ, అమిత్ షాల ప్రభుత్వం వెంటనే మధ్య భారతదేశంలో తిష్ట వేసిన సైనిక బలగాలను, క్యాంపులను ఎత్తివేసి, ప్రజాస్వామికమైన శాంతియుత వాతవరణం కొరకు శాంతి చర్చలకు సిద్దపడాలని, అదేవిధంగా ఆపరేషన్ కగార్ ను వెంటనే రద్దుచేసి, పౌర ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు పాటుపడాలని హితవు పలికారు. సుదా, స్పందన, మేరి, కోటేశ్వరి పాల్గొన్న వారిలో ఉన్నారు.

## ఆశ కార్యకర్తల అక్రమ అరెస్టలను నిరసిస్తూ ఆందోళన

**గార్ల, మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఛలో హైదరాబాద్ కార్యక్రమం కు వెళ్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు లు చేయడం అప్రజాస్వామికం అని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ అన్నారు.ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాదు లో ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ఆందోళన కు బయలుదేరిన అశ కార్యకర్తల ను ముందస్తు గా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఆశ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) అధ్వర్యంలో పట్టణ పురవీధులలో ప్రదర్శన నిర్వహించి, స్థానిక నెహ్రూ సెంటర్ లో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లు గా వైద్య అరోగ్య శాఖ లో విధులు నిర్వహిస్తూ చాలి చాలని వేతనాలతో పని చేస్తున్న ఆశ కార్యకర్తల కు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రమాదేవి, నమ్మి,చంద్రమ్మ,పార్వతీ తదితరులు ఉన్నారు



## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డిఈఓ రవీందర్ రెడ్డి



**బయ్యారం, మార్చ్ 24(పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని డి.ఈ.ఓ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ బృందం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షా గదులను తనిఖీ చేసి,గదులలో వెంటిలేషన్, తాగు నీటి వసతి ఉండే విధంగా నిర్వాహకులు శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలను సెంటర్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు.విద్యార్థులు ప్రశాతంమైన వాతావరణంలో పరీక్షలు వ్రాసి వందశాతం ఉత్తీర్ణత సాదించాలన్నారు. ఈ కార్యక్రమం తనిఖీ బృంద సభ్యులు,ఎమ్ఈఓ దేవేంద్ర చారి,గార్ల బయ్యారం సీఐ రవి కుమార్,ఎస్ ఐ తిరుపతి, పోలీస్ సిబ్బంది దినేష్,రజిని పాల్గొన్నారు.

## చట్టబద్ధ పాలన సాగించండి లేదా దిగపోండి

- రెండు తెలుగు రాష్ట్రాల అల్లూరి సీతారామరాజు పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దప రాజన్న డిమాండ్
- ఆపరేషన్ కగార్ వ్యతిరేకంగా జరిగిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ కార్యక్రమం



**జగ్గంపేట, మార్చి-24,(పీసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగ బద్దంగా ఎన్నుకోబడిన పాలక ప్రభుత్వాలు చట్టబద్దంగా పాలన వ్యవహారాలు నడిపించాలని లేదా ప్రజలు ఇచ్చిన అధికారం నుండి పాలకులు వైదొలగాలని అల్లూరి సీతరామారాజు పోరాట సమాతి రెండు తెలుగు రాష్ట్రాల వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దప రాజన్న డిమాండ్ చేశారు. 2025, మార్చి-24, సోమవారం రోజు జగ్గంపేట, బూర్గుపుడిలో ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా 115 వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం మార్చి-8 ని ఎత్తిపట్టండని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ(విముక్తి)) ఇచ్చిన పిలుపులో బాగంగా ఆ సంస్థ నాయకురాలు పి.సునీత అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ హరిబాబు, ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, అల్లూరి సీతారామరాజు పోరాట సమితి నాయకులు కొట్టేటి నాగేశ్వరరావు, పెద్ది లీవ్ డ్రాజ్, కొమ్మన లక్ష్మణ్ మరియు మహిళా సంఘ కార్యకర్తలు కంటే లక్ష్మి, కొట్టేటి లక్ష్మి, కర్నము ఏసమ్మ, పసుపురెడ్డి సూర్యవతి, బి.వెంకట లక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు. సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ సంఘం పీఓడబ్ల్యూ(విముక్తి) ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని మార్చి-1 నుండి 31 వరకు రెండు తెలుగు రాష్ట్రాలలో జిల్లాలవారిగా జరపండని ఇచ్చిన పిలుపు ఆదివాసి ప్రజల హక్కలతో పాటు అటవీ హక్కుల సంరక్షణకు జరుపుతున్న పోరాటాల్లో అల్లూరి సీతారామరాజు పోరాట సమితి మద్దతుగా నిలబడి సంఘీభావం తెలియజేస్తుందని బి.రాజన్న ప్రకటించారు. బీహార్, ఒరిస్సా, చత్తీస్ ఘడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో ఆపరేషన్ కగార్ అంతిమ యుద్ధం పేరుతో ఆదివాసి బిడ్డలను మావోయిస్టు నక్సలైట్లుగా ముద్రవేసి ఎన్కౌంటర్ల పేరుతో అంతమొందించడం కేంద్రంలో బీజేపి నరేంద్రమోదీ, అమిత్ షా ప్రభుత్వానికే చెల్లిందని ఎన్ చిట్టిబాబు మండిపడ్డారు. తరతరాలుగా వారి సంస్కృతిని, సాంప్రదాయాను కాలరాచి, లక్షలాది మంది సైనిక బలగాలచే ఈదేశ పౌరులు అయినా ఆదివాసి ప్రజల జీవించే హక్కులను కాలరాయడం అమానుషం, అప్రజాస్వామికం అని అన్నారు. ఇప్పటికైన దుర్మార్గమైన సైనిక చర్యలకు స్వస్థి పలికి, ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణహోమాన్ని వెంటనే సిహెచ్ హరిబాబు ఆపాలని కోరారు. స్త్రీపురుష సమానత్వం, సమాన పనికి సమాన వేతనంతో పాటు తమపై జరిగే అన్నిరకాల దోపిడీ, పీడన అణిచివేతలకు వ్యతిరేకంగా వర్గపోరాటాలలో బాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా శ్రామిక మహిళాలోకానికి పి.సునీత పిలుపు నిచ్చారు.

## ఘనంగా భగత్ సింగ్ 94వ వర్ధంతి

- ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కన్వీనర్ పల్లి సురేష్ అధ్యక్షతన రఘుదేవపురం లో జరిగిన కార్యక్రమం
- కొవ్వొత్తులతో ఘన నివాళి



**రాజమండ్రి, మార్చి-23, (పీసిడబ్ల్యూ న్యూస్):** భరతదేశ విముక్తి కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 94 వర్ధంతి ని పురస్కరించుకుని రాజు గురు, సుఖదేవ్ ల సంస్మరణ కార్యక్రమాన్ని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఘనంగా నిర్వహించారు. 2025, మార్చి-23 న రాజమండ్రి, సీతానగరం, రఘుదేవపురంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ హరిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ-(విముక్తి)) రెండు తెలుగు రాష్ట్రాల నాయకురాలు పి.సునీత, ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి మరియు పివైఎల్ గద్దె విజయ్ పాల్గొని ప్రసంగించారు. నూనూగు మీసాల లేత వయస్సులో దేశం కోసం తమను తాము ఆత్మ బలిదానం చేసుకున్న విప్లవ వీర కిషోరుల త్యాగాలను నేటి విద్యార్థి, యువకులు అలవర్చుకొని, మరో స్వతంత్ర పోరాటానికి సిద్దపడాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి, దేశ ప్రజాల విముక్తితో పాటు విదేశీ బానిస సంకెళ్ళను తెటంచడానికి గదర్ పార్టీని ఏర్పాటు చేసి, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. దేశ సంపూర్ణ విముక్తి కోసం పోరాడుతున్న క్రమంలో పార్లమెంట్ సమావేశాల్లో కుట్ర జరుగుతుందని తెలుసుకొనన్న భగత్ సింగ్, బటు కేశవదత్తుతో కలిసి ప్రాణహాని తలపెట్టని పొగబాంబును విసిరి బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన గొప్ప పోరాట యోదులని కొనియాడారు. యావత్తు దేశ ప్రజానీకానికి తెలియచెప్పేందుకే ఇలాంటి సాహసోపేతమైన చర్యకు పాల్పపడ్డారని అన్నారు. విప్లవ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లపై తెల్లదొరలు తమ కుట్రలతో తప్పుడు కేసులకు గురిచేసి, ఉరిశిక్ష లతో వారి ప్రాణాలను తీశారని గుర్తుచేశారు. ఒక తెల్లోడువెళ్ళిపోయి, మరో నల్లవాడు అధికారం చేపట్టినప్పటికి ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదని గొంతెత్తి నినదించారని అన్నారు. జెండాలు మారాయి, టోపీలు మారాయి కులం, మతం, ప్రాంతీయ తత్వాలతో దేశ ప్రజలలో విష సంస్కృతిని పెంచి, రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. భగత్ సింగ్ 94 వ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అమరులు షహీద్ భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవులు చూపిన దారిలో పౌర ప్రజాస్వామిక హక్కులకోసం, ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేయాలని, శాంతియుత వాతావరణం నెలకొల్పేలా తగిన చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం నేడు సామాజిక బాద్యత కలిగిన ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. బడా భూర్జువా, భూస్వామ్య, సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడుదామని నినదిస్తూ సభ అనంతరం కొవ్వొత్తులతో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లకు ఘన నివాళులు అర్పించారు.

# జర్నలిస్టుల సంక్షేమమే టీజేఎఫ్ లక్ష్యం

- జర్నలిస్టు కుటుంబ సభ్యులందరికీ హెల్త్ కార్డులు
- ప్రెస్ క్లబ్ లో హెల్త్ కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించిన టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి
- ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో మూడు రోజులపాటు ప్రత్యేక క్యాంపు




**ఖమ్మం, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్ (ప్రతినిధి):** జర్నలిస్టుల సంక్షేమమే ద్యేయంగా టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) పనిచేస్తోందని, జర్నలిస్టు కుటుంబ సభ్యులందరూ తప్పకుండా హెల్త్ కార్డులు తీసుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టిజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మూడు రోజులపాటు మార్చి 24 నుండి 26 వరకు కొనసాగనున్న జర్నలిస్టుల హెల్త్ కార్డు జారీ ప్రక్రియ క్యాంప్ కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... రాత్రింబవళ్లు విధి నిర్వహణలో ఉంటూ, ఉరుకుల పరుగుల జీవితంలో కంటికి నిద్ర లేకుండా పని జర్నలిస్టులకు తప్పకుండా హెల్త్ కార్డు కలిగి ఉండాలని సూచించారు.ఎవరో వస్తారు.. మరెవరో ఆదుకుంటారని వారికోసం ఎదురు చూస్తే ప్రయోజనం ఉండదని, మనకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఐదు లక్షలు విలువైన వైద్యాన్ని ఉచితంగా ఈ కార్డు ద్వారా పొందవచ్చని, జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు తప్పకుండా హెల్త్ కార్డులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఖమ్మం ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల కోసం హెల్త్ కార్డుల జారీ ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సెంటర్ వద్ద ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ కు అనుసంధానం అయి ఉంటే 2 సార్లు ఓటిపి చెప్పి వెంటనే హెల్త్ కార్డులు వెంటనే పొందవచ్చని పేర్కొన్నారు.జర్నలిస్టుల సంక్షేమం, వారి శ్రేయస్సే ముఖ్యమని తమ టీజెఎఫ్ యూనియన్ నిరంతరం ముందు ఉండి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజెఎఫ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు టిఎస్ చక్రవర్తి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గుద్దేటి రమేష్ బాబు, కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, యూనియన్ నాయకులు అంతోటి శ్రీనివాస్, కె. గోవింద్, ఉల్లోజి రమేష్, రోషి రెడ్డి, ఎస్ డి న్యూస్ యాదగిరి, పిసి డబ్ల్యు నరేష్, జీకే న్యూస్ నరేష్, కంప్యూటర్ టెక్నికల్ ఇంచార్జ్ వెంకట్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యాలయంలో జై బాపు జై భీమ్ జై సం విధాన్



**కరీంనగర్, 24 (పి సి డబ్ల్యూ న్యూస్ ):** కరీంనగర్ పట్టణంలోనికాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్ లో కరీంనగర్ DCC అధ్యక్షులు మానకొండూర్ శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యం ఆధ్వర్యంలో జరిగిన జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన AICC మెంబర్ మాజి MLA చల్లా వంశీధర్ రెడ్డి కిస్వాగతం పలికిన కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపాలరావుపేట మాజి ఎంపీటీసీ తాజా మాజి సర్పంచ్ కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డిజిల్లా మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన ఏఎస్ఐలను అభినంధించిన పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా

**రామగుండం మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తూ ఏఎస్ఐ లుగా పదోన్నతి పొందిన అధికారులకు పోలీస్ కమీషనర్ అంబర్ కిశోరే ఝా అభినందించి, ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- అధికారులు..కార్మికులు కలిస్తేనే సంస్థ మనుగడ.. జనక్ ప్రసాద్

**గోదావరిఖని: మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్):** రామగుండం1 జిడికె-5 గనిలో సోమవారం ఐఎన్టియుసి ఎరియా ఉపాధ్యక్షులు కచ్చకాయల సదానందం, గని ఫిట్ సెక్రటరీ ఎల్ ఆంజనేయులు, బ్రాంచ్ సెక్రటరీ టి అంజయ్య ఆధ్వర్యంలో గేటు మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఐఎన్టియుసి పనిచెస్తుందని, అలాగే 6గ్యారంటీలను అమలు చేసే బాధ్యత యూనియన్ తీసుకుంటుందని అన్నారు. కార్మికుల సొంతింటి పథకం, అలవెన్స్ లపై విధించే ఇన్కంటాక్స్ ను యాజమాన్యంచే త్వరలో మాట్లాడి మాఫీ చేయిస్తామని అన్నారు. కొన్ని సంఘాల దుష్ప్రచారం నమ్మవద్దని మహిళా సోదరీమణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఒసిపి5 యాజమాన్యం ఒంటెద్దు పోకడలను సహించే ప్రసక్తి ఉండదని వాటిని ఎప్పటికప్పుడు ఎదుర్కొంటామని ఇంకా తదితర సమస్యలపై కార్మికులకు ఏ కష్టం వచ్చినా పరిష్కరించే బాధ్యత యూనియన్ పరంగా తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు త్వరలోనే హై పవర్ కమిటీ వేతనాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసు, జనరల్ సెక్రెటరీ వికాస్ కుమార్ యాదవ్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ పోతర బోయిన సమ్మయ్య యాదవ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గడ్డం కృష్ణ ,గంద్ర దామోదర్ రావు, జనగామ శ్రీనివాస్ గౌడ్, కైలాసకోటి శ్రీనివాస్ , సెంట్రల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ లు మండ రమేష్, పుట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు దేశానికి అవసరం ...

- ఎన్నికల విధానంలో సమూల మార్పులు జరగాలి
- రైతు రుణమాఫీ పై కాంగ్రెస్ మోసపూరిత వైఖరి బట్టబయలైంది.
- రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ప్లాప్...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...





**కరీంనగర్ జిల్లా,మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్):** ఒకే దేశం ఒకే ఎన్నిక ( జమిలి ఎన్నికలు) భారతదేశానికి ఎంతో అవసరమని, ప్రస్తుత ఎన్నికల విధానంలో సమూల మార్పులు జరగాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఇల్లంద కుంట బిజెపి మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజన వన్ నేషన్, వన్ ఎలక్షన్ పై వర్క్ షాప్ ప్రోగ్రాం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో, పార్లమెంటుకు శాసనసభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల ఖర్చు భారీగా తగ్గుతుందని, తరచుగా వివిధ కారణాలతో ఎన్నికలు జరగడం వల్ల దేశ ,రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానంలో ఎన్నికలు నిర్వహించాలనన్నారు, జమిలి ఎన్నిక విధానంపై ప్రజలకు అవగాహన తీసుకురవడానికి బిజెపి నాయకులు కార్యకర్తలు తగిన కృషి చేయాలన్నారు. ఆదిశగా అవగాహన సదస్సులు , సమావేశాలు నిర్వహించి ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే రుణమాఫీ పై కాంగ్రెస్ మోసపూరిత వైఖరి నేడు బట్టబయలైందన్నారు,అసెంబ్లీ సాక్షిగా , మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీపై చేసిన ప్రకటన, రెండు లక్షల పైచిలుకు రుణం ఉన్న వారికి రుణమాఫీ చేసే ప్రసక్తి లేదని మంత్రి తుమ్మల అసెంబ్లీ వేదికగా ప్రకటన చేసి రైతుల ఆశలపై నీళు చల్లారన్నారు. ఎన్నికల సమయంలో 2 లక్షల రుణమాఫీ తప్పకుండా చేస్తామన్న కాంగ్రెస్ నేడు రుణమాఫీ విషయంలో దాటవేత ధోరణి అవలంబిస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ నాలుగు విడతల్లో అరకోర రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందన్నారు. అసెంబ్లీ వేదికగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు లక్షల పై ఉన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేసేది లేదని వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో అందరికీ రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ నేడు కొందరికే చేసిందని , రుణమాఫీ విషయంలో అనేక ఆంక్షలు, నిబంధనలు పెడుతూ రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతాంగాన్ని మోసం చేసినట్టు , 6 గ్యారంటీలు, 420 హామీల విషయంలో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ప్రస్తుతం డబ్బులు పుట్టడం లేదని , అప్పు ఎవరు ఇవ్వడంలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రేవంత్ రెడ్డికి , కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకర్తలకు తెలియదా..? ఇప్పుడు కాంగ్రెస్ చెవిలో పూలు పెట్టడానికి ప్రయత్నిస్తుందని ఆయన ఘాటుగా విమర్శించారు. 16 నెలల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ప్లాప్ అయిందన్నారు. ఈ కార్యక్రమం లో కన్వీనర్ అబ్బిడి తిరుపతి రెడ్డి, కో కన్వీనర్ గుత్తికొండ రాంబాబు, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి,ఉప్పుల రమేష్, కంకణాల రవీందర్ రెడ్డి,ఆరెల్లి శ్రీనివాస్, గురుకుంట్ల సాంబన్న, కొత్త శ్రీనివాస్,కంకణాల సురేందర్ రెడ్డి,ఎండీ షఫీ,నల్ల లింగారెడ్డి,రావుల విజయ్ బాబు, తాళ్ల పాపిరెడ్డి, మురహరి గోపాల్, చిట్ల శ్రీనివాస్, ఉప్పుల శ్రీనివాస్, ఉప్పు దుర్గయ్య, కొక్కుల దేవేందర్, జోడు సంపత్, గురుకుంట్ల సంజీవ్, చిట్ల తిరుపతి, గుడికందుల రమేష్,జంగం సమ్మయ్య పాల్గొన్నారు.

# మార్నింగ్ వాక్‌లో రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి: మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్):** వనపర్తి జిల్లా ఏదుల మండలంలో కనీస సౌకర్యాలు కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సోమవారం ఏదుల మండల కేంద్రంలో నిర్వహించిన రాచాల మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఉదయం ఏదులకు చేరుకున్న రాచాలకు మాజీ సర్పంచ్ మశన్న ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రంలో స్థానిక ప్రజలతో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నడక కొనసాగించారు.ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు.ప్రాథమిక పాఠశాలలో 164 మంది విద్యార్థులు ఉన్నారని, తరగతి గదులు మాత్రం రెండే ఉండటంతో...శిధిలావస్థలో ఉన్న భవనాల్లోనే విద్యను అభ్యసిస్తున్నారన్నారు.దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరితగతిన నూతన భవనాలను నిర్మించడంతో పాటు ఒక బోర్ వేయించి, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరారు.స్థానికంగా గతంలో ఉన్న బస్సు షెల్టర్ రోడ్డు విస్తరణలో పోవడంతో ప్రస్తుతం ప్రయాణికులకు షెల్టర్ లేకుండా పోయిందని, కావున ప్రయాణికుల సౌకర్యార్థం ఒక బస్టాండ్ నిర్మించాలన్నారు.తమకు విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ప్రస్తుతం చిన్నంబావి ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అక్కడి నుంచి కాకుండా చెన్నారం లేదా వనపర్తి ఫీడరుకు కలపాలని, అదే విధంగా రాజాపూర్ మరియు మాచుపల్లి నుండి ఏదుల మండల కేంద్రానికి బిటి రోడ్డు సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలపై మాజీ సర్పంచ్, తదితరులు రాచాలకు వినతి పత్రం అందజేశారు.గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, మిషన్ భగీరథ నీరు వారానికోసారి కూడా రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్టానిక ప్రజలు రాచాలతో మొరపెట్టుకున్నారు.దీనిపై స్పందించిన రాచాల ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురిసినా అధికారుల సరైన ప్రణాళిక లేని కారణంగా తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని, తాగునీటి కోసం ప్రత్యేక శాఖ ఉన్న కూడా అధికారుల పట్టింపేది అని మండిపడ్డారు.తమ దృష్టికి వచ్చిన సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే మరియు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఎర్రగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మశన్న, బీసీ పొలిటికల్ జెఎసి మండల అధ్యక్షుడు గువ్వల హనుమంతు, ప్రధాన కార్యదర్శి జానకిరామ్, పరశురాం, జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్ రాష్ట్ర కార్యదర్శి వి వి గౌడ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు గుర్రం రాఘవేందర్, కొత్తకోట పట్టణ కొత్తకోట అధ్యక్షుడు అంజన్న యాదవ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు దేవర శివ, శ్రీరంగపురం అధ్యక్షుడు నాగరాజు, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు చేస్తేనే గాని కానరాని డ్రైనేజీ పరిశుభ్రత




**మంథని: మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్):** సూరయ్య పల్లి గ్రామం ఎస్సీ కాలనీ డ్రైనేజ్ కాలువలు మట్టి చెత్త లాంటి వ్యర్థాలతో, నిండిపోవడం ద్వారా నీళ్లు కాల్వలో నుండి దుర్వాసన రావడం వంటి అనారోగ్య సమస్యల్ని కి అడ్డగా ఉంది. ఆరు ఏడు నెలలుగా ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు తీయడం లేదని కాలనీవాసులు చెప్తున్నారు. గ్రామ సంబంధిత అధికారులకి ఇది గుర్తు రావడం లేదేమో సమస్యగా అనిపించడం లేదేమో, గ్రామపంచాయతీ లక్షల బడ్జెట్ని ఖర్చుకి చూపిస్తున్నారు. తప్ప పనులేమీ కనబడట్లేదు ఇలాగే ఉంటే పై అధికారులు సంప్రదించాల్సింది ఉంటదని కాలనీవాసులు తెలియజేశారు.

# ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ఆవిష్కరించిన 'సెంచురీ మ్యాట్రెస్'



**హైదరాబాద్, మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్)::** 35 ఏళ్లకు పైగా గొప్ప వారసత్వాన్ని కలిగి ఉన్న భారత దేశపు స్లీప్ స్పెషలిస్ట్, సెంచరీ మ్యాట్రెస్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మంగళం రోడ్‌లో అత్యాధునిక ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ఘనంగా ప్రారంభించిందని సెంచరీ మ్యాట్రెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కొత్త స్టోర్‌ను సెంచరీ మ్యాట్రెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలాని, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్, ఫౌండేషన్ చైర్మన్ ప్రణీత్ పెనుమడు, టిటిడి ఎంపి కో-ఆప్-బ్యాంక్ అధ్యక్షుడు ఆర్.కిషోర్ కుమార్ తదితరులు ప్రారంభించారు. ఈ స్టోర్ సాంకేతికత యొక్క విలక్షణమైన కలయిక, నిపుణుల మార్గదర్శకత్వంతో సమగ్ర అనుభవాన్ని అందిస్తుందన్నారు. కస్టమర్‌లు వారి అవసరాలకు అనుగుణంగా పరిపూర్ణమైన మ్యాట్రెస్‌ను పొందడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు.

# చారిత్రాత్మక ప్రదేశాలకు కేంద్ర నిధులు కేటాయించాలి

**- దళితుల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులు ప్రకటించాలి.. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**పెద్దపల్లి:మార్చ్24(పీసీబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దేశంలోని చారిత్రాత్మకంగా అణచివేయబడిన, వ్యవస్థాపితంగా బహిష్కరించబడిన దళితుల గళంగా పార్లమెంట్‌లో గంభీరంగా మాట్లాడారు. "సబ్‌కా వికాస్"అని చెప్పిన ప్రభుత్వం, దళితుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్న హామీ ఇచ్చినప్పటికీ, అసలు ఈ బడ్జెట్‌లో ఆ నిధులు ఎక్కడ ఉన్నాయి అని ప్రశ్నించారు. దళితుల అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోంది,మా హక్కైన వాటా ఎందుకు అందడం లేదుభారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం ప్రభుత్వం దళితుల విద్యా, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించాలి, సామాజిక అన్యాయాల నుండి రక్షించాలి కానీ ఈ బడ్జెట్‌లో సంక్షేమ నిధుల కేటాయింపు కేవలం ?1,65,000 కోట్లు ఇది మొత్తం బడ్జెట్‌లో కేవలం 3.25% మాత్రమే కానీ దళితులు దేశ జనాభాలో 16% ఉన్నారు. మాకు తగిన వాటా ఎందుకు ఇవ్వడం లేదు?ఎంపీ గడ్డం వంశీకృష్ణ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు దళిత వ్యాపారులకు ప్రత్యేక పన్ను రాయితీలు, విద్యా, ఉపాధి అవకాశాల పెంపు, సాంకేతిక అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలనీ డిమాండ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో దళిత సమాజానికి ప్రత్యేకంగా దృష్టి సారించాలి.ఎస్సీ కాలనీల అభివృద్ధి, గృహ నిర్మాణం మెరుగుపరచాలి.తెలంగాణ దేశ జీడీపీ లో 36% కంటే ఎక్కువ వాటా ఇస్తుంటే, కేవలం 15% నిధులు మాత్రమే తిరిగి రావడం అన్యాయం అని ఎంపీ కేంద్రాన్ని నిలదీశారు.ప్రధాన డిమాండ్లు: బీజేపీ కుంభ మేళా కి రైళ్లు కేటాయించినట్లుగా పెద్దపల్లి నుండి తిరుపతి,శబరిమలై కి ప్రయాణికులకు ప్రత్యేక రైలు కనెక్షన్లు కల్పించాలి,పెద్దపల్లిలో బీపీవో కేంద్రం ఏర్పాటు చేయాలి, ధర్మపురి, రామగిరి దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి, ైతుల కోసం కోల్డ్ స్టోరేజ్, గిడ్డంగి సదుపాయాలు అందించాలి, పెద్దపల్లి ,మంచిర్యాల లలో రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలి. ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలంగాణకు, ముఖ్యంగా పెద్దపల్లికి తగిన నిధుల కేటాయింపులు జరగాలి అని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం, సమగ్ర అభివృద్ధి జరగాలి. ఇది నిజమైన వికాస్ కావాలి అని ఆయన స్పష్టం చేశారు.

# అడకత్తెరలో పోక చెక్కలా...?

- కష్టాల కడలిలో పంచాయతీ కార్యదర్శులు.
- ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామ పంచాయతీలు.
- నిధులు లేక సొంత డబ్బులు వెచ్చిస్తున్న వైనం.
- సర్వేల పేరిట అదనపు భారం.
- పాలకవర్గాలు లేవు.
- ప్రత్యేకాధికారులు పట్టించుకోరు.



గ్రామ కార్యదర్శులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమయానికి నిధులు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గ్రామ పంచాయతీలలో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే అయిదు నెలలుగా ట్రాక్టర్ డీజిల్‌తో పాటు ఇతరత్రా మరమ్మతుల కోసం సొంత డబ్బులను వెచ్చిస్తున్నారు. దీనికి తోడు అధికారులు అప్పగిస్తున్న పలు సర్వేలతో ఇబ్బందులు పడుతున్నారు. జీపీ కార్మికులకు కొద్ది నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారిని సముదాయించి పని చేయించడానికి కార్యదర్శులు పడుతున్న కష్టాలు అన్నీ..ఇన్నీ కావు..గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి అయిదు నెలలు గడచిపోయింది. ప్రత్యేకాధికారులు ఉన్నా లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు 5 నెలల నుంచి, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 24 నెలల నుంచి పంచాయతీలకు రావడం లేదు. దీంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాభివృద్ధిలో ప్రముఖ భూమిక పోషించే పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో గ్రామాల అభివృద్ధి పనులతో పాటు మరమ్మతులు తదితర వ్యవహారమంతా సర్పంచ్‌లు, పాలకవర్గాలు చూసుకునేది.. గత ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియగా, ఆ వెంటనే ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించింది. ఇతర శాఖలో కీలకంగా ఉన్న గెజిటెడ్ అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు గ్రామాలపై సరైన దృష్టి సారించలేకపోతున్నారు. తమ మాతృ శాఖలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఎప్పుడో ఒక సారి గ్రామాలకు వెళ్తు సలహాలు, సూచనలకు మాత్రమే పరిమితమవుతున్నారు.

### అంతా తామై..

పంచాయతీ పాలన భారం అంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతోంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మరమ్మతు పనుల నిర్వహణ బాధ్యత, సిబ్బంది జీతభత్యాలు, పన్నుల వసూళు ,, ఆదాయ, వ్యయం లావాదేవీలు, నెలవారి చెల్లింపులు తదితర విషయాలన్నీ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మరీ అప్పులు చేసి జీపీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కార్యదర్శులు వాపోతున్నారు.

### నిలిచిపోయిన నిధులు..

గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు నిలిచిపోయాయి. ట్రాక్టర్‌కు అవసరమైన డీజిల్‌తో పాటు పల్లె ప్రకృతి వనాలు, పారిశుధ్య నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్లు, చెత్త దంపింగ్ యార్డులు, శ్మశానవాటిక నిర్వహణ, వాటర్ ట్యాంక్‌ల క్లోరినేషన్ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు 5 నెలల నుంచి, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 24 నెలల నుంచి పంచాయతీలకు రావడం లేదు. దీంతో గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధుల కొరత ఏర్పడింది. జీపీ కార్మికుల జీతాలు ఇవ్వలేక, ట్రాక్టర్ల నెలవారీ కిస్తీలు కట్టలేక కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వసూలైన పన్నులు, ఇతరత్రా ఆదాయం సాధారణ ఖర్చులకే సరిపోవడం లేదు. ఏదైనా మరమ్మతులు, అత్యవసర అవసరాలకు పంచాయతీ కార్యదర్శులే తమ జేబులో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటు పాలకవర్గాలు లేక, నిధులు రాక, అటు ప్రత్యేకాధికారులు పట్టించుకోక అడకత్తెరలో పోకచెక్కలా కార్యదర్శులు నలిగిపోతున్నారు.

### సర్వేలతో సతమతం

మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందాన పంచాయతీల పాలనతోనే అష్టకష్టాలు పడుతున్న పంచాయతీ కార్యదర్శులపై సర్వేల భారం మోపుతున్నారు. దీంతో వారు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. తమ శాఖలకు సంబంధం లేని సర్వేలను అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటా మిషన్ భగీరథ నల్లాల వివరాలను నమోదు చేసే విషయంలో కార్యదర్శులే కీలకంగా వ్యవహరించారు.

### సర్వేల నుంచి మినహాయించాలి..

ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేల నుంచి పంచాయతీ కార్యదర్శులను మినహాయించాలి.ఇప్పటికే పంచాయతీ పాలన భారం మోయలేక పోతున్నాం. ప్రత్యేకాధికారులు సలహాలు, సూచనలకే పరిమితం అవుతున్నారు. దీంతో గ్రామాలలో అత్యవసర పనుల కోసం సొంత డబ్బులను ఖర్చుపెడుతున్నాం. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి మా పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. పంచాయతీ రాజ్ శాఖ పనులే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన పనులను సైతం మాతో చేయించడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మాపై పని భారం తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

# మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రెస్ మీట్ కామెంట్స్.

**కరీంనగర్,మార్చ్24(పీసీడబ్ల్యూ న్యూస్):**నిన్న జరిగిన బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం ఓదార్పు సమావేశంగా ఉంది. సమావేశం పెడితే అభ్యంతరం లేదు కానీ సభలో ప్రతి సారి హిందువుల మనోబాలు దెబ్బతినేలా వాక్యలు చేయడం బాదకరం. కేటీఆర్ గారు అయోధ్య నుండి వచ్చినవి అక్షింతలు కావు... రేషన్ బియ్యం తెచ్చి అక్షింతల పేరుతో పంచి ప్రజలను మోసం చేశారని వాఖ్యలు చేయడాన్ని తీవ్రంగ ఖండిస్తున్నాం. ఒక వర్గం ఓట్ల కోసం... మద్దతు కోసం యావత్తు హిందు సమాజాన్ని కించ పరచడం శోచనీయం. హిందువుల మనోబాలను కించ పరుస్తే.. హిందు సమాజం అంతా ఏకమౌతుంది. దీన్ని మీరు గమనించుకోక పోతే అది మీ దురదృష్టం. మీరు చేసిన వాఖ్యలను హిందు సమాజం అంతా గమనిస్తుంది. ఎన్నికల సందర్భాల్లో తగిన రీతిలో మీకు బుద్ది చెప్పినప్పటికీ... మీ తీరు మారడం లేదు. అయోధ్యలో గుడి నిర్మాణం చేయడం అనేది హిందు ప్రజల చిరకాల వాంఛ. ఆ వాంచను నెరవేరుస్తున్న ఘనత భారతీయ జనతా పార్టీ నరెంద్ర మోడిది. దాన్ని కూడ కించపరిచే విధంగా వాక్యలు చేస్తున్నారంటే... సమాజం అంతా గమనిస్తుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు అభివృద్ధి అంటే తెలియదని విమర్శలు చేయడం చాలా విడ్డూరంగా ఉంది. అదే సంధర్భంలో గంగుల కమలాకర్ గుడి నిర్మాణం చేశారని గొప్పలు చెప్పడం హాస్యాస్పదం. గుడి పేరుతో పునాది వేశారు తప్ప.... ఇటుక పెల్లె కూడ పెట్టని ఘనత అప్పటి మీ ప్రభుత్వానాది ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వానిది. రాజకీయంగా ఎలాంటి పదవి లేని సమయంలో నగరంలో శక్తి టెంపుల్ నిర్మాణం చేసిన ఘనత బండి సంజయ్ కుమార్ గారిది. ఆ దేవాలయం నగర ప్రజలందరికి కళ్ళముందు కనబడుతుంది. ఇవన్ని మరిచి కేటిఆర్ వాఖ్యలు వింటుంటే చాలా విడ్డూరంగా ఉంది. మీరు మాట్లాడే ప్రతి మాట కరీంనగర్ ప్రజలు



గమనిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ కుమార్ నాయకత్వం లో చాలా అభివృద్ధి పనులు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి.కరీంనగర్ కు స్మార్ట్ సిటీ హోదా ఎలా వచ్చిందనే విషయం పురపాలక శాఖ మంత్రి గా పని చేసిన మీకు తెలియక పోవడం మూర?త్వం. పది సంవత్సరాలు పురపాలక శాఖ మంత్రి గా పని చేసి కూడ స్మార్ట్ సిటీ ఎలా వచ్చింది అనే విషయం తెలియక పోతే ఎలా...? కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీ నగరాలను ఎంపిక చేస్తే అందులో కరీంనగర్ కు హోదా దక్కడం వాస్తవం కాదా. వచ్చిన స్మార్ట్ సిటీ లో కరీంనగర్ అభివృద్ధి కోసం నిధులు తెచ్చిన ఘనత బండి సంజయ్ కుమార్ కాదా మీ రికార్డుల్లో చూస్కోండి. పెద్ద ఎత్తున స్మార్ట్ సిటీ నిధులు తెచ్చి కరీంనగర్ నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేసింది బండి సంజయ్ కుమార్. నగరంలో ప్రజలు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్యలు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ సమస్యలు, ఇలా అనేక సమస్యలకు పరిష్కారం చూపిన నాయకులు బండి సంజయ్. మీరు ఏంశారు...? కరీంనగర్ నగరానికి కేబుల్ బ్రిడ్జ్ అని తెచ్చి... వేసిన రోడ్లు లేచి పోయి బిగించిన లైట్లు రాకుండ కళావిహీనంగా ఉంది. మానేరు రివర్ ఫ్రంట్ పరిస్థితి ఎలా ఉందో చూడండి... మోండి గోడలు... మట్టి కట్టలు పోసి వందల కోట్ల రూపాయల దుర్వినియోగానికి సజీవ సాక్ష్యంగా ఉంది. కరీంనగర్ నగర ప్రజలు చూస్తున్నారు... 200 కోట్ల పనులని చేసి... ఎలా ప్రజాధనం దండుకున్నారో త్వరలోనే కరీంనగర్ ప్రజలకు విన్నవించ బోతున్నాం. వందల కోట్ల రూపాయల తో మానేరు వాగుకు చెక్ డ్యాంలు కడితే ఎలా కూలిపోయాయో సజీవ సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయ్. ఇది మీ ఆయాంలో జరిగిన అభివృద్ధి. బండి సంజయ్ గారి ఆయాంలో నగరంలో జరిగిన రోడ్లు, లైట్లు, పార్కులు, త్రాగు నీరు, లాంటి అభివృద్ధి పనులు ప్రజలకు కనిపిస్తున్నాయి. ప్రజలకు అంతా తెలుసు ఎవరు ఏం చేస్తున్నారో అన్ని విషయాలు తెలుసు. అందుకే బండి సంజయ్ కుమార్ ను పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాడు అదే ఆయన చేసిన అభివృద్ధి కి నిదర్శనం. బండి సంజయ్ కుమార్ గారు చేసిన అభివృద్ధి కి ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. ఇవన్ని తెలిసి మోడి నాయకత్వం, భారతీయ జనతా పార్టీ ని విమర్శించడం అనేది విడ్డూరం. మీరు ఎన్నైనా సమావేశాలు పెట్టుకొని మీ పని తనం చెప్పుకొండి కానీ మీ రాజకీయ ప్రయోజనాల కోసం ఇంకో వారిపై విమర్శలు చేయడం మీ వైకరి. భారతీయ జనతా పార్టీ ని, మా నాయకులను చులకన చేసి మాట్లాడం మానుకోవాలి. ఎన్ని సార్లు భారతీయ జనతా పార్టీ నాయకత్వాన్ని విమర్శిస్తే... ప్రజలంతా ఒక్కటయ్యే పరిస్థితి వస్తుంది మీరు గమనించుకోవాలి. అయోధ్య లేదు... అక్షంతలు లెవ్వు అంతా డ్రామా అని వాఖ్యలు చేయడం చాలా ధారుణం అన్నారు. అంతా గమనిస్తున్న ప్రజలు సమయం సందర్భం వచ్చినప్పుడు సరైన బుద్ధి చెబుతారు. ఈ మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీసులు జవాబుదారీగా పని చేయాలి: జిల్లా ఎస్పీ కిరణ్....



**చిట్యాల మార్చి 24. (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 21 మంది ఆర్జీ దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని, ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సమస్యలతో పోలీసు స్టేషన్ వచ్చినప్పుడు తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చేసినప్పుడే పోలీసులపై నమ్మకం కలుగుతుందని అన్నారు.

## అంగన్వాడి సెంటర్లలో చెడిపోయిన గుడ్లు సరఫరా

- పౌష్టిక ఆహారం పై పలువురు చర్చ

- మండలంలోఅంగన్వాడి సెంటర్‌లో పట్టించుకోని అధికారులే కరువు



**రామడుగు మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్లలో చెడిపోయిన గుడ్లు సరఫరా చేయడంపై ఎవరైతే లబ్ధి పొందారో వారు గమనించి నా విషయం. గుడ్లు చెడిపోయినవా మంచివా అనే దానిపై నీటిలో వేసి లబ్ధిదారుడు చూస్తే పూర్తిస్థాయిలో అన్ని నీటి పైన తేలి ఆడడం కనిపించింది. దీనికి గాని సరైన సమయంలో అంగన్వాడి సెంటర్లలో లబ్ధిదారులకు గుడ్లకు సరఫరా చేయకపోవడం ఆలస్యం జరగడం వల్లనే ఇలా అవుతుందని ఆరోపణలు వస్తున్నాయి. బాల్యం దశలోనే ఈ విధంగా గుడ్లు సరఫరా చేయడం పౌష్టికాహారం పై పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. అంగన్వాడి సెంటర్లలోని గుడ్ల సరఫరాను పై స్థా యి అధికార యంత్రంగా పట్టించుకోకపోవడం దీనికి కారణమని తెలుస్తుంది... ఇంతే కాకుండా మండలంలోని మరికొన్ని గ్రామాలలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి..



# సీతారామ ప్రాజెక్టు అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలి ..!

**● రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ..! ● తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల డిమాండ్.**




**ఇల్లందు/బయ్యారం,గార్ల మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):**సీతారామా ప్రాజెక్టులో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని వెంటనే న్యాయ విచారణ చేపట్టాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వ సమాజం వ్యవస్థాపకులు విశ్వ జంపాల తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భం గా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016లో ప్రారంభించిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నీళ్లలో ఇల్లందు, మహబూబాబాద్ డోర్నకల్ నియోజక వర్గాల వాటా ఎంతో తేల్చాలని విశ్వ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు నియోజకవర్గాల త్రాగు సాగునీరు కోసం ప్రారంభించిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అలైన్మెంట్ మార్చి ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు చుక్క నీరు ఇవ్వకుండా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన సీతారామ ప్రాజెక్ట్ 2016 ప్రతిపాదిత నమూనా (DPR)ను ప్రభుత్వం బహిర్గతం చేయాలని విశ్వ డిమాండ్ చేశారు. సాగు త్రాగునీరు లేక ఇల్లందు ఏజెన్సీ ప్రాంత ప్రజలు, మహబూబాబాద్ డోర్నకల్ నియోజకవర్గం ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని, ఇబ్బందులను ఎదుర్కొంటుంటే ఇక్కడ కాదని నాగార్జునసాగర్ ఆయ కట్టుగా ఉన్న పాలేరు, ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి ప్రాంతాలకు నీళ్లను తరలించడం, స్థిరికరిం చడం లేదా రెండో పంటకు నీళ్లను తరలించుకపోవడం కుట్రపూరిత చర్యని ఆయన అన్నారు. 2016లో కేసీఆర్ శంకుస్థాపన చేసిన సీతారామ ప్రాజెక్టుకు ఆ తర్వాత నిర్మాణం చేపట్టిన సీతారామ ప్రాజెక్టుకు ఏ మాత్రం సంబంధం లేదని విశ్వ ఆరోపించారు. కెసిఆర్ శంకుస్థాపన చేసిన రోళ్ళపాడు/సీతారామ ప్రాజెక్టును రద్దుచేసి ఇల్లందు నియోజకవర్గానికి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ లో భారీ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతి, అక్రమాలకు సంబంధించి ఖమ్మం జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరావు, ఇల్లందు మహబూబాబాద్ డోర్నకల్ శాసనసభ్యులు కోరం కనకయ్య, మురళి నాయక్ రామచంద్రనాయక్ లు మాట్లాడకపోవడం పలు అనుమానాలకు, అక్రమాలకు తావిస్తుందన్నారు. 2016లో ప్రతిపాదించి అనుమతించిన సీతారామ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 7926.147 కోట్ల రూపాయలు కాగా రీడిజైన్ తర్వాత ఆ వ్యయాన్ని 13,243.50 కోట్ల రూపాయలకు పెంచి మొదట ప్రతిపాదించిన సీతారామ ప్రాజెక్టు ప్రతిపాదిత నమూనాకు పూర్తి విరుద్ధంగా రీడిజైన్ చేసి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం అన్యాయం అన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్ట్ రీడిజైన్ లో జరిగిన అవినీతి అక్రమాలకు సంబంధించి పూర్తి బాధ్యత వహించాలని విశ్వ డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి నిజానిజాలు నెగ్గు తేల్చి ఇల్లందు మహబూబాబాద్ డోర్నకల్ నియోజకవర్గం సాగు తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని విశ్వ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గిన్నారపు మురళి తారక రామారావు, మెంతెన వసంతరావు, పూనెం మురళీకృష్ణ, మద్దెల నేతాజీ, ఈదుల ముత్తయ్య, కోడెపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కరువు నిండు గర్భిణీలు అవస్థల పాలు పట్టించుకునే నాధుడు లేడు



**జోగులాంబ,24(పిసి డబ్ల్యూ న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ విభాగం అంటేనేంట్ వర్డ్ కనీస వసతులు కరెంటు లైటింగ్ బాత్రూం ఫ్యాన్లు లేక ఉక్కపోతతో గర్భిణీ స్త్రీలు తీవ్ర ఇబ్బందుల పాలు అవుతూన్నారు ఫ్యాన్లు లేని కారణంగా ఉక్కపోత తాళలేక గర్భిణీ స్త్రీలకు తమ ఇంటి దగ్గర నుంచి ఫ్యాన్లు తెచ్చుకునే పరిస్థితి చాలా ఇబ్బందులకు గురవుతున్నారు మరుగుదొడ్లు కూడా లేక పక్క వార్డులకు రాత్రిపూట పోవడానికి ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వ పెద్దలు గుర్తించి తక్షణమే ఆ వార్డులో ఫ్యాన్లు రిపేర్ చేయించాలని మరుగుదొడ్లు కూడా క్లీన్ చేపించాలని గాజుల కృష్ణ రెడ్డి డిమాండ్ చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి



**మరిపెడ:మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాడోర్నకల్‌లొని మరిపెడ పట్టణంలో ని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లొని సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం. డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ఆదేశాల మేరకు మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో పదో వార్డు మాకుల తండాలో సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు రఘువీరా రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అప్సర్ రవి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బానోతు చిన్న భూక్యా అమృ నాయక్ ప్రమోద్ ఇస్లాత్ విరోజి నాయక్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లబ్ధిదారురాలైన లావుడియా కళ్యాణికి 20వేల రూపాయలు చెక్కుని అందించడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరికి కృషిచేసిన ఎమ్మెల్యే కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు

## ప్రజలకు జవాబు దారీగా పోలీస్‌లు పనిచేయాలి: జిల్లా ఎస్పీ.టి.శ్రీనివాస రావు



**జోగులాంబ,మార్చి 24(పిసి డబ్ల్యూ న్యూస్):** గద్వాల ప్రజలకు పోలీస్ అధికారులు సిబ్బంది జవాబుదారీగా ఉంటూ బాధ్యతాతో పనిచేయాలని జిల్లా ఎస్పీ.టి శ్రీనివాస రావు పోలీస్ అధికారులను ఆదేశించారు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 10మంది ఆర్జీ దారుల నుంచి డి.ఎస్పి మోగిలయ్య గద్వాల్ అలంపూర్ మరియు శాంతినగర్ సర్కిల్ అధికారుల సమక్షంలో ఫిర్యాదులు స్వీకరించారు ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో పోలీస్ స్టేషన్ ఎస్సై లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సమస్యలతో పోలీసు స్టేషన్ వచ్చినప్పుడు తక్షణమే స్పందించి జవాబుదారీగా ఉంటూ న్యాయం జరిగేలా చేసినప్పుడే పోలీసులపై నమ్మకం కలుగుతుందని అన్నారు బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయుత: యువ నాయకుడు మాలే నరేష్ గౌడ్

**మిడ్జిల్: మార్చి 24(పిసి డబ్ల్యూ న్యూస్):**మిడ్జిల్ మండలం ల్ పది రోజుల క్రితం వేముల గ్రామానికి చెందిన రేవల్లి చంద్రయ్య ప్రమాదవశత్తు మరణించడం జరిగింది. మరియు కొప్పుల పోచమ్మ అనారోగ్యంతో మరణించినారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ మాజీ సర్పంచ్ మాలే లక్ష్మీదేవి తనయుడు మాలే నరేష్ గౌడ్ మృతుల కుటుంబ సభ్యులకు7500 రూపాయల ఆర్థిక సహాయం చేసి అన్ని విధాలుగా ఆదుకుంటానని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించినారు. వల్లూరి నాగరాజు కోడిగంటి ఆంజనేయులు పరశురాములు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రాజ్యాంగ పరిరక్షణపై ప్రతి పౌరునికి వివరించాలి

**● జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో సంవత్సరం వరకు గ్రామ స్థాయి నుండి జాతీయస్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టాలి ● ప్రతి గ్రామంలో అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి భారత రాజ్యాంగ పుస్తకం, కాంగ్రెస్ పార్టీ జెండా, అంబేద్కర్ చిత్రపటాలతో పాదయాత్ర చేపట్టాలని కార్యకర్తలకు పిలుపు ● కార్యకర్తల సహకారంతోనే జాతీయ స్థాయిలో చేపట్టిన కార్యక్రమాలలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండేది**



**కరీంనగర్ జిల్లా మార్చి 24(పిసి డబ్ల్యూ న్యూస్):** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమము, ఒక సంవత్సరం కాలం పాటు ప్రతి గ్రామాన్ని, వార్డు, డివిజన్, మండలంలోని ప్రతి గడపను తడుతూ జరిగే దేశవ్యాప్త పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా నేడు మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్.కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కరీంనగర్ డిసిసి కార్యాలయం (ఇందిరా గార్డెన్స్ లో) జిల్లా కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి సి డబ్ల్యూ సి మెంబర్, ఏఐసీసీ సెక్రటరీ వంశీ చందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, జిల్లా స్థాయి మరియు ఈ కార్యక్రమానికి సంబంధించి కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల సమన్వయకర్తలుగా నియమితులైన నమిండ్ల శ్రీనివాస్, పటేల్ రమేష్ రెడ్డి, ఎన్ గాల వెంకట్రామిరెడ్డి, కరీంనగర్ హుజురాబాద్ శాసనసభ, స్థానాలకు పోటీ చేసిన పురుమల్ల శ్రీనివాస్, ఒడితెల ప్రణవ్ బాబు, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్ హాజరైనారు.మొదట కార్యక్రమం ఉద్దేశించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు, అనంతరం జిల్లా సమన్వయకర్త రుద్ర సంతోష్ సమావేశానికి విచ్చేసిన నాయకులకు కార్యకర్తలకు జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం పై ఎల్ఈడి స్క్రీన్ మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ వివరించారు.మొదట చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, సమన్వయకర్తలు నమిండ్ల శ్రీనివాస్, ఏఐసిసి ఆదేశాల మేరకు జామిన స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఈ కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రస్థాయిలో జిల్లాని ప్రథమ స్థానంలో ఉండేలా ప్రణాళిక రూపొందిస్తామని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడబ్ల్యుసి మెంబర్ ఏఐసీసీ సెక్రెటరీ చల్లా వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ...జిల్లా నలుమూలలనుండి విచ్చేసిన పార్టీ శ్రేణులను అభినందిస్తున్నాను. మీ అందరి కష్టంతోనే పార్టీ అధికారంలోకి వచ్చింది జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా తెలంగాణ మొదటి స్థానంలో ఉండేది. రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులుగా ప్రారంభించిన డిజిటల్ మెంబర్షిప్ లో దాదాపు 42లక్షల సభ్యత్వం చేసి తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నాడు బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశం మొత్తంలో అత్యధికంగా సంతకాల సేకరణ చేసిన తెలంగాణ ఏఐసీసీ పిలుపు ఇచ్చిన ఈ జై బాపు జై భీమ్ జై సంవిధ్ధన్ కార్యక్రమంలో మన తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండాలి. నేడు అసెంబ్లీ ఉన్నప్పటికీ అనుమతి తీసుకొని మన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వడం గొప్ప విషయం. దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ ఏఐసీసీ అధ్యక్షులుగా పదవి చేపట్టి 100 సం.లు పూర్తినయినందువల్ల ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. మనం రాజ్యాంగం అమలు చేసుకొని 75సం.లు పూర్తి అయినందువల్ల ఈ కార్యక్రమం తీసుకోవడం జరిగింది. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెం మంత్రి అమిత్ షా అంబేద్కర్ ని అవమాన పరిచే విధంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జై బాపు జై భీమ్ కార్యక్రమం చేపడుతున్నాము. పార్టీ శ్రేణులు గాంధీ అభిమానులు పెద్ద ఎత్తున రాజ్యంగా పరిరక్షణ పాదయాత్ర చేపట్టి ప్రతి పౌరునికి రాజ్యాంగం గురించి ప్రజాస్వామ్యం గురించి వివరించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉంది.మనం ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజెప్పాలి. కార్యకర్తలకు అవకాశాలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు రావాలంటే ఈ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాన్ని చక్కగా ఉపయోగించుకోవాలి. ఈ కార్యక్రమానికి సంబంధించి బెల్గం లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. జిల్లా స్థాయిలో కార్యక్రమం పూర్తి చేసుకొని మండల స్థాయిలో ఉగాది రంజాన్ లోపల మండల వార్డు డివిజన్ స్థాయిలో కార్యక్రమం చేయుటకు రూపకల్పన చేసుకోవాలి. ఈరోజే మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ఆ వివరాలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు అందజేయాలి. ఏప్రిల్ 2 నుండి పాదయాత్ర ప్రారంభమవుతుంది. కాంగ్రెస్ పార్టీ కట్టిన ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు, అంబేద్కర్ విగ్రహం లేని ఊరు ఉండదు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించాలి, పిసిసి అందజేసే కిట్ లో భారత రాజ్యాంగ పుస్తకం ఉంటుంది.నేడు మనం చేసిన ప్రతిజ్ఞ ను గ్రామీణ ప్రాంతాలలో పౌరాల చేత చెపించాలి, వారికి పిసిసి ఇచ్చిన కర ప్రతులను అందజేయాలి, ఒక చేతిలో గాంధీ చిత్ర పటం, అంబేద్కర్ చిత్ర పటం, కాంగ్రెస్ జెండాతో ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి పాదయాత్ర చేపట్టాలి.ఒక గ్రామంలో పాదయాత్ర చేపట్టిన వారు మరొక గ్రామంలో పాదయాత్ర చేసే వారికి ఇవి అందజేయాలి.ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, నాయకులు ఆరెపల్లి మోహన్, బొమ్మ శ్రీరామ్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, కర్రసత్య ప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ నాయకులు మునిగంటి అనిల్, మడుపు మోహన్, కొరివి అరుణ్ కుమార్, ఆకారపు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాజా మరియు మాజీ ప్రజా ప్రతినిధులు, బ్లాక్, మండల, నగర, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, జిల్లాకు చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధులు, జిల్లాకు చెందిన మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ, బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ, లీగల్ సెల్, సేవ దళ్ తో అటు ఇతర కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు మా గోస చూడండి?

**● గుర్తూరులో పెన్షన్ దారులను నిలువ దోపిడీ చేస్తున్న పోస్ట్ ఆఫీస్? ● పోస్ట్ భర్తది .. పెత్తనం భార్యదా? ● అధికారులారా ఈ అనుమతి వారికి ఎవరిచ్చారు ఆవేదన వ్యక్తం చేస్తున్న పెన్షన్ దారులు? ● 200 నుండి 1000రూపాయల వరకు వసూలు?**

**● పూర్తి విషయాలను ఒకసారి పరిశీలిద్దాం**



**తొర్రూరు ప్రతినిధి, మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇది మేజర్ గ్రామపంచాయతీ. ఇక్కడ పెన్షన్ దారులు సంఖ్య ఎక్కువే,వారి గోస ఎవరికీ చెప్పుకో లేనిది అని అంటున్నారు పెన్షన్ దారులు? ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోస్ట్ ఆఫీస్ ద్వారా పెన్షన్ దారుల తిప్పలు ఎక్కడా లేదు ఇది కొన్నేళ్లుగా జరుగుతున్న సమస్య అని గ్రామస్తులు పేర్కొంటున్నారు? గత కొన్ని ఏళ్ల క్రితం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, కొందరు ప్రజాప్రతినిధులు, పోస్ట్ ఆఫీసులో పెన్షన్ దారులపై చేస్తున్న భౌతిక దాడులపై పోస్ట్ ఆఫీస్ వారి తీరు మారాలని ధర్నాలు,రాస్తారోకోలు చేసినప్పటికీ కూడా వారి మాట, తీరు వారి పనితీరు పెన్షన్ దారులపై అసభ్య పదజాలాలతో( లంజా కొడకా, లంజా ముండా) ఇలా మాటలు అని చిత్రహింసలకు గురి చేశారు? మాది సెంట్రల్ గవర్నమెంట్ మీరు ఏం పీకుతారు, మీతో ఏమవుతుంది అని పోస్ట్ ఆఫీస్ నాది నా ఇష్టం అంటూ పోస్ట్ ఆఫీస్ లో మహిళా పెత్తనం ఏమిటి? పోస్ట్ ఆఫీస్ కి ఈ మహిళకు ఏం సంబంధం? ఈమెకు ఎవరిచ్చారు అధికారం? పెన్షన్ తీసుకునే వృద్ధులు వారు పడే అనేక అవస్థలు ఎవరికి చెప్పుకోలేక దీన స్థితిలో నిమ్మ కుండి పోతున్నారు. ఇక్కడ వారికి పెన్షన్ ఇవ్వరు, తొర్రూర్ కి వెళ్తే అక్కడివారు రానివ్వరు, పెన్షన్ లేక పస్తులుండి చావాల్సిందేనా అంటున్నారు పెన్షన్ దారులు?సంవత్సరం క్రితం ఏం జరిగింది. **గుర్తురు గ్రామంలో పోస్ట్ ఆఫీస్ ఎక్కడ?** గ్రామంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ ఊరు చివరన వారికి ఇష్టం వచ్చిన ప్రాంతంలో తాగునీటికి, కూర్చునేందుకుసౌకర్యం లేనిస్థలం లో ప్రాంతంలో నెలకు ఒకచోట పెన్షన్ దారులను తిప్పుతూ బి వో వారిదే రాజ్యం అన్నట్టుగా పెన్షన్ దారులను హింసకు గురి చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్, ఎంపీడీవో, పోస్ట్ అధికారులు చొరవ తీసుకొని మూడు నెలలపాటు పెన్షన్ ఇచ్చే వారికి బి వో ను మార్చి పెన్షన్ ఇప్పించారు. తిరిగి అదే బి వో లో పోస్ట్ వెంకటేశ్వర్లు కొనసాగేందుకు తొర్రూర్ పోస్ట్ ఆఫీస్ ఇన్స్పెక్టర్కు లిఖితపూర్వకంగా తన భార్యను పెన్షన్ సమయంలో అనుమతించనని, తనయుని సహాయంతోనే పెన్షన్ దారులకు డబ్బులు చెల్లిస్తానని లిఖితపూర్వకంగా దరఖాస్తు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. బి వో అలాగే పోస్ట్ ఆఫీస్ ను గ్రామం మధ్యలోనే కొనసాగిస్తామని తెలిపి కొంతకాలం వరకు గ్రామంలోనే కొనసాగించారనీ ఇప్పుడు తన నివాసానికి దగ్గరలో వసతులు లేని పూరి గుడిసెలో పెన్షన్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ గారు మా బాధలను గమనించి గ్రామపంచాయతీ కార్యాలయంలోని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని వృద్ధ పెన్షన్ కోరుతున్నారు.**మూడు నెలల నుండి ఏమిజరుగుతుంది?** జనవరి నెల పెన్షన్ సమయంలో ప్రతి ఒక్కరికి వచ్చే నెల నుండి 4000 రూపాయల పెన్షన్ వస్తుంది మీరు ఇప్పుడు 200 చెల్లిస్తేనే ఆ పెన్షన్ తీసుకునే అవకాశం ఉంటుంది అని పెన్షన్ దారులకు ఇలాంటి మాటలు చెప్పుకుంటూ సుమారు రెండు నుంచి మూడు వందల మంది పెన్షన్ దారుల వద్ద నుండి 200 నుండి1000 రూపాయల వరకు వసూలు చేశారని పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేశారు? ఈ విషయంపై కొంతమంది పెన్షన్ దారులను వివరణ కోరేందుకు గ్రామంలోకి వెళితే మా పేర్లు బహిర్గతం అయితే వచ్చే నెల నుండి మాకు పెన్షన్ ఇవ్వరు అని వారు పేర్లు చెప్పడానికి జంకుతున్నారు? ఇలా జనవరి కాకుండా ఫిబ్రవరి నెలలో కూడా ఇదే తంతు కొనసాగిందని వారు ఆవేదనకు గురి అవుతున్నారు మీకు పాసుబుక్కులు వస్తాయని డబ్బులు చెల్లించిన వారికే ఇస్తామని చెప్పుకుంటూ వసూలు చేసిన సొమ్ము పై వారికి ఎలాంటి పోస్ట్ ఆఫీస్ కి సంబంధించిన రుజువు లేకుండా చేస్తున్నారని చెల్లించిన వారందరికీ కాగితంపై పోస్ట్ ఆఫీస్ ముద్ర కానీ వారి సంతకం కానీ ఇవ్వలేదని మదన పడుతున్నారు. ఇప్పటికైనా పోస్ట్ అధికారులు డబ్బులు చెల్లించిన వారికి పాస్ బుక్ ఇస్తూ అందులో వారు ఇచ్చిన సొమ్ముకు పోస్ట్ ఆఫీస్ ముద్ర వేసి ఇవ్వాలని పెన్షన్ దారులు కోరుతున్నారు?. ఇది ఇలా ఉంటే గుర్తురు బి వో తన పొలం పనులకు వెళ్లిటం పెన్షన్ సమయంలో పోస్ట్ అధికారి కుమారుడు, భార్య వీరు ఇద్దరే పెన్షన్ దారులకు డబ్బులు చెల్లించే అధికారం ఎవరు ఇచ్చారని కొందరు పెన్షన్ దారులు మండిపడుతున్నారు?. భర్త అధికారమైతే భార్య పెత్తనం ఏమిటంటే ప్రశ్నిస్తున్నారు?. దూర ప్రాంతం నుండి వచ్చిన వృద్ధ పెన్షన్ దారులకు పెన్షన్ ఇవ్వకుండా సిగ్నల్ లేదని, వేలిముద్ర పడటం లేదని సాకులు చెప్తూ అనేకమార్లు వారిని పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిప్పుకుంటున్నారని వాపోతున్నారు?.

## మిట్టదొడ్డి గ్రామం దగ్గర శ్రీశైలం పాదయాత్ర భక్తులకు అన్నదానం మెడిషన్ పంపిణీ కార్యక్రమం

**గద్వాల/గట్టు:మార్చి 24(పిసి డబ్ల్యూ న్యూస్):** గట్టు మండలం గద్వాల నియోజకవర్గం జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామ మృత్యుంజయ సహస్ర లింగ శివాలయం దగ్గర సనాతన ధర్మ సేవా సంస్థ 21-3-2025 నుండి 25-3-2025 మిట్టదొడ్డి శివాలయం సనాతన ధర్మ సేవా సంస్థ వారు శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్లే వాళ్లకు గత మూడు రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ అన్నదాన కార్యక్రమం రాయచూర్ జిల్లా కురిడి వారి సహకారంతో జరుగుతోంది ఈ కార్యక్రమంలో కర్నాటక మహారాష్ట్ర నుండి శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు అన్నదానం స్వీకరించి అక్కడ కొనసాగుతున్న వైద్య శిబిరంలో మందులు తీసుకొని అక్కడ చెట్ల కింద విశ్రాంతి తీసుకుని అన్నదానం నిర్వాహకులను ఆశీర్వాదించి బయలు దేరుతున్నారు అలాగే రాయచూరు కర్నూలు శ్రీశైలం కు బయలుదేరే ప్రభుత్వం ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే యాత్రికులు కూడా అక్కడ అగి అన్నదానం స్వీకరించి బయలుదేరుతున్నారు ఈ కార్యక్రమంలో మిట్టదొడ్డి గ్రామ ప్రజలు మరియు పెద్దలు అలాగే మిట్టదొడ్డి చుట్టుపక్కల గ్రామస్తులు కూడా పాల్గొని విజయవంతం చేస్తున్నవారు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు అన్నదాన కార్యక్రమం మొదలు కావడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు





# లుక్స్‌పై కాకుండా.. పనితనంపై దృష్టిపెట్టండి..

**• మిల్క్‌బ్యూటీ కామెంట్‌పై తమన్నా రియాక్షన్**

తమన్నా తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. ఈ అమ్మడు విజయ్ వర్మతో డేటింగ్ చేస్తోంది. అయితే గతంలో తమన్నా తనను మిల్క్ బ్యూటీ అనే ట్యాగ్ తో పిలవొద్దు అని చెప్పింది. తనకు మిల్క్ బ్యూటీ అనే ట్యాగ్ ఇవ్వొద్దు అని తెలిపింది. తాజాగా మరోసారి మిల్క్ బ్యూటీ ట్యాగ్ గురించి ప్రస్తావించింది. తమన్నా భాటియాను "మిల్క్ బ్యూటీ" అని పిలవడం గురించి ఆమె ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఓదెల 2' సినిమా ప్రమోషన్ సందర్భంగా తమన్నాను ఓ రిపోర్టర్ ఇలా అడిగారు: "ఒక మిల్క్ బ్యూటీలో శివశక్తి ని చూడాలని ఎలా అనిపించింది.?" దీనికి తమన్నా స్పందిస్తూ, తనను "మిల్క్ బ్యూటీ" అని పిలవడం తనకు సమస్య కాదని, అయితే తన పాత్రల ద్వారా తన సామర్థ్యాన్ని చూపించడంపైనే ఎక్కువ దృష్టి పెడతానని చెప్పింది. ఆమె మాటల్లో, "నన్ను మిల్క్ బ్యూటీ అని పిలవడం గురించి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ నేను ఈ సినిమాలో శివశక్తి పాత్రను పోషిస్తున్నాను, ఇది ఒక ఆధ్యాత్మిక శక్తితో కూడిన పాత్ర. నా పాత్రల ద్వారా నా నటనా సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని చూపించడమే నా లక్ష్యం." అని తెలిపింది. ఆమె తన లుక్స్‌పై కాకుండా తన పనితనంపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది తమన్నా.

## మన అవార్డులను లాగేసుకుంటున్నారు :

# దీపికా పదుకొణె



మన దేశంలో ఎంతోమంది ప్రతిభ ఉన్న నటీనటులున్నారనీ, అయితే చాలాసార్లు మనకు రావలసిన అవార్డులను లాగేసుకున్నారని దీపికా పదుకొణె కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. "భారతదేశం సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు ఏమాత్రం గుర్తింపు రాలేదు. 'చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్‌లను లాగేసుకున్నారు. 'ఆర్ఆర్ఆర్'లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలిగా ఇది మన సినిమా అని ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం కలిగింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. 'ది బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను" అని అన్నారు. 2023 ఆస్కార్ వేడుకలో 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని నాటునాటుని పాటనుఉ దీపిక ప్రేక్షకులకు పరిచయం చేశారు. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రం నుంచి 'నాటు నాటు' ఇదే..' అంటూ దీపిక ఈ పాటను పరిచయం చేయడం విశేషం.



## కుర్రాళ్ల మతిపోగుడుతున్న

# బాంధవి శ్రీధర్

బాంధవి శ్రీధర్ .. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ చిన్నది 2022లో విడు దలైన "మసూద" అనే తెలుగు సినిమాలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంలో ఆమె దెయ్యం పట్టిన అమ్మాయి పాత్రలో నటించి, తన నటనా ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. ఈ సినిమా బాంధవి శ్రీధర్ మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. దాంతో ఆఫర్స్ కూడా క్యూ కట్టాయి. బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా అడుగుపెట్టడానికి ముందు చైల్డ్ ఆర్టిస్ట్‌గా కూడా పనిచేసింది. ఆమె "మిస్టర్ పర్‌ఫెక్ట్", "రభస", "మొగుడు", "రామయ్య వస్తావయ్య", "మజ్ను" వంటి తెలుగు సినిమాల్లో చిన్న పాత్రల్లో కని పించింది. అయితే, "మసూద" సినిమాతోనే ఆమెకు హీరోయిన్‌గా పెద్ద బ్రేక్ లభించింది. అంతేకాకుండా, బాంధవి శ్రీధర్ అందాల పోటీల్లో కూడా విజయం సాధించింది. ఆమె 2019లో "మిస్ ఇండియా రన్నరప్"గా నిలిచింది, అలాగే "మిస్ ఇండియా ఫ్యాషన్ ఐకాన్ 2019" మరియు "మిస్ ఇండియా మిస్ ఆంధ్రప్రదేశ్ 2019" టైటిల్స్‌ను గెలుచుకుంది. ప్రస్తుతం బాంధవి శ్రీధర్ తెలుగు చిత్ర పరిశ్రమలో మరిన్ని మంచి అవకాశాల కోసం చూస్తోంది. అలాగే సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. తన గ్లామరస్ లుక్స్ తో నెటిజన్స్ ను కట్టిపడేస్తుంది బాంధవి. తాజాగా ఈ చిన్నది కొన్ని అందమైన ఫోటోలు షేర్ చేస్తుంది. బోల్డ్ అండ్ బ్యూటీ ఫుల్ ఫోటోలను వదిలింది. ఈ ఫోటోలకు కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. త్వరలోనే ఈ బ్యూటీ ఆకట్టుకునే సినిమాతో వస్తుందని ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# వీటీ15పై వరుణ్‌తేజ్ ఆశలు

**- హార్రర్, కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో మూవీ**

టాలీవుడ్ యాక్టర్ వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా చిత్రం వీటీ15. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే కొరియన్ కనకరాజు (వీటీ15 వర్కింగ్ టైటిల్) ఫస్ట్ లుక్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. ఇండో-కొరియన్ హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. ఈ మూవీ సోమవారం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ఘనంగా మొదలైంది. మేర్లపాక గాంధీ, క్రిష్, హీరోయిన్ రితికానాయక్ ఇతర టీం మెంబర్స్ సమక్షంలో ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ చిత్రాన్ని టాప్ ప్రొడక్షన్ హౌస్ యూవీ క్రియేషన్స్ ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ తెరకెక్కిస్తోంది. మేర్లపాక గాంధీ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈ డైరెక్టర్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. కాగా వీటీ 15 ఫస్ట్ లుక్‌లో డ్రాగన్ డిజైన్ ఉన్న జాడిపై కోడ్ లాంగ్వేజ్‌తో ఉన్న క్లాత్ మంటలు అంటుకొని అనుమానాస్పదంగా కనిపిస్తుండగా.. సస్పెన్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో కూడిన కథతో సినిమా ఉండబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఇక వేట హాస్యాస్పదంగా మారితే అంటూ పోస్టర్‌లో రాసిన క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచేస్తుంది. వరుణ్ తేజ్ చివరగా మట్కా సినిమాలో నటించగా.. బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. ఎఫ్ 3 తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ మేర్లపాక సినిమాపై భారీగానే ఆశలు పెట్టుకున్నాడు.

# ఆమె కూతురితో నటించటానికి కూడా సందేహించను : సల్మాన్‌ఖాన్

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సికందర్. ఈ సినిమాకు మురుగదాస్ దర్శకత్వం వహించారు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుంది. ఈ మూవీ మార్చి 30న ఈద్ పండుగ కానుకగా థియేటర్లలోకి రానుంది. అయితే, ఈ సినిమాలో రష్మిక, సల్మాన్ మధ్య ఏజ్ గ్యాప్‌పై నెట్టింట తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఏజ్ గ్యాప్ వివాదంపై సల్మాన్ స్పందించారు. ఈ మేరకు విమర్శకులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నాకు, హీరోయిన్ రష్మికకు మధ్య దాదాపు 31 ఏళ్ల వయసు తేడా ఉందని కొందరు అంటున్నారు. ఏజ్ గ్యాప్ విషయంలో రష్మికకు ఎలాంటి ప్రాబ్లమ్ లేదు. ఆమె తండ్రికి కూడా సమస్య లేదు. వాళ్లకే లేని సమస్య మీకు ఎందుకు..? రష్మికకు పెళ్లయ్యాక ఆమె కూతురితో కూడా నటిస్తా. వాళ్లకు లేని ప్రాబ్లమ్స్ మీకెందుకు..?' అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం సల్మాన్ రియాక్షన్ నెట్టింట వైరల్ అవుతోంది. బాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో సికందర్ ఒకటి. కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సత్యరాజ్ విలన్‌గా నటిస్తున్నాడు. రంజాన్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. మంచి స్పందన లభించింది.



# ఆమె అందానికి హద్దులు లేవు

అందాల ముద్దుగుమ్మ బాలీవుడ్ నటి దిశా పటానీ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. లోఫర్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఈ మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మకు అంతగా అవకాశాలు రాలేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ బ్యూటీ వరస సినమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. గ్లామర్ పాత్రలతో కుర్రకారును మాయ చేస్తుంది. అయితే తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో పలు ఫోటోలు పోస్టు చేసింది. అందులో ఐపీఎల్ ఓపెనింగ్ అంటూ షేర్ చేసిన ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. దిశా తాజాగా ఐపీఎల్ 2025 ఓపెనింగ్ సెరోమణిలో కనిపించి అందరినీ ఆకట్టుకుంది. క్రిస్టల్స్‌తో తయారు చేయించిన డ్రెస్‌లో తన అందాలను ఆరబోతస్తూ, డ్యాన్స్ పుర్ఫామెన్స్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతుండటంతో, దిశా పటాని అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ అమ్మడు అభిమానులు.

